


లోకల్ పార్టీలకు ఈసీ షాక్ 02

www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం    తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA    RNI No: TELTEL/2024/86684


| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 05.07.2025 | సంపుటి : 2 | సంచిక :153 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 05.07.2025 | volume : 2 | Issue : 153 | Pages : 8 | Cost : 2/- |




'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 99639 98364




ప్రజా సంక్షేమాన్ని ఆశించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి నియామకాలు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు వైద్య విధాన పరిషత్ సూపరిండెంట్ వెంకటేశ్వరరావు అవినీతి అక్రమాలతో మార్కులను కృత్రిమంగా సృష్టించి మెడికల్ తయారుచేసి కొంతమంది అధికారులు చేసిన పాపంలో భాగస్వాములు చేసి లక్షలాది రూపాయలు అక్రమంగా వసూలు చేసి ఓ మహిళా అధికారి జ్యోతిర్లింగా లీలలు అండగా ఉ ండటంతో ఓ భాయ్ సహాయంతో నాటి కలెక్టర్ కు సిఫారసులు పంపించి కలెక్టర్ కార్యాలయంలోని సిసి ఇతర అధికారులను ప్రసన్నం చేసుకొని ఆమోదముద్ర వేసి కోట్లాది రూపాయలు అక్రమంగా వసూలు చేసి ఖజానా నింపుకున్నట్లు ఆరోపణలు.



# తెలంగాణలో "రాజముద్ర" వార్తా కథనానికి వైద్య ఆరోగ్య శాఖలో ప్రకంపనలు..?



- ఖమ్మం జిల్లా నియామకాలలో జరిగిన మతలబుపై జిల్లా కలెక్టర్ ఆరా...?
- నోటిఫికేషన్ ప్రకారం కాకుండా అడ్డగోలుగా నియామకాలు...?
- నాటి సూపరిండెంట్ ప్రతిపాదనతో జిల్లా కలెక్టర్ ఆమోదంతో ఉద్యోగాల నియామక ముద్ర...?
- అప్పటి జిల్లా అధికారుల హయాంలో కోట్లాది రూపాయల భూ అక్రమ పంపిణీ...?
- వచ్చిన మార్కులు కంటే అడ్డగోలుగా మెరిట్ జాబితా తయారు...?
- మళ్లీ విచారణ చేయటానికి అడ్డుపడుతున్న ఆ శాఖ జిల్లా అధికారి...?
- మాట్లాడేదంతా .. వట్టిదేనా...?
- ప్రైవేటు హాస్పిటల్ లు నిర్వహిస్తున్నారని భయమా...?

**రాజముద్ర ప్రత్యేక సంచలన కథనం...2**

**స్టేట్ బ్యూరో, రాజముద్ర ప్రతినిధి:** 2021 సంవత్సరంలో ఖమ్మం జిల్లాలో నిరుపేదల, మధ్య తరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించా లనే లక్ష్యంతో ఇచ్చినట్లే నోటిఫికేషన్ ఇచ్చి నోటిఫికేషన్ కు తూట్లు పొడిచి అడ్డగోలుగా లక్షలాది రూపాయలు వసూ లు చేసి కృత్రిమంగా మార్కులు సృష్టించి అర్హత కలిగిన వారికి బదులు కాసులకు కక్కుర్తి పడి రాష్ట్ర, వైద్య విధాన పరిషత్ కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగుల సహకారంతో అవినీతి కట్టలతో 14 మందిని అడ్డగోలుగా నియామకం చేసి ప్రజాధనాన్ని లూటీ చేసినట్లు ఆరోపణలు విమర్శలు గత నాలుగు సంవత్సరాలు నుండి వినిపిస్తున్నా యి. ప్రభుత్వం మారింది ప్రజా ప్రభుత్వం కొలువు తీరింది. ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా ఓ మంత్రి విధులు నిర్వహిస్తున్నారు. కానీ నాటి ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై జిల్లా, రాష్ట్ర స్థాయి అధికా రులు నోరు మెదపక పోవడం మరీ విశేషం. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కీలకంగా పనిచేసిన ఖమ్మం జిల్లాకు సంబంధించిన ఓ మాజీ ఎంపీ ప్రస్తుత మంత్రి అండదండలతో నాడు విచారణ చేసిన ఫైలు పై నాటి ఆరోగ్యశాఖ మంత్రి సంతకం చేయకుండా ఆనాటి మంత్రి మాజీ ఎంపీ అనుచరులతో పాటు ఓ బిఆర్ఎస్ మాజీ మంత్రి రంగప్రవేశం చేసి గుట్టుచప్పుడు కాకుండా బుట్ట దాఖలు చేసినట్లు ఆరోపణలు విమర్శలు ఉన్నాయి. జిల్లా వైద్య విధాన పరిషత్ లో నియామకాలపై చెరగని ముద్ర వేసిన నేతలు ప్రస్తుతం అధికారంలో ఉండటం పైగా మాజీ మంత్రి ప్రతిపక్షంలో ఉండటంతో వ్యవహారం అంతా సాఫీగా సాగింది. కానీ రాజముద్ర తెలుగు దినపత్రిక సంచలన కథనంతో తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా ఖమ్మం జిల్లాలో ప్రకంపనలు సృష్టించినట్లు ఉ ద్యోగ సంఘాలు ఆనాడు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసి విఫలం చెందిన నిరుద్యోగులు కథనంతో సంతోషం వ్యక్తం చేస్తున్న ట్లు తెలుస్తోంది. కాగా ఆనాటి నియామకాలలో ప్రతిపాదన చేసిన సూ పరిం డెంట్ వెంకటేశ్వరావు ఓ వ్యవహారంలో క్రమశిక్షణ చర్యలకు గురై ప్రస్తుతం వైరా నియోజకవర్గ కేంద్రంలో విధులు వెలగబెడుతున్నట్లు తెలుస్తోంది. సదరు అధికారికి ఆ నియామకం గురించి తెలియదట... వివరాలు చెప్పాలట... గుర్తు చేయాలట... నివేదికలు పెట్టాలట. అని వ్యాఖ్యానించడం ఆ అధికారి నిర్లక్ష్యానికి అడ్డగోలు వసూలుకు నిదర్శనంగా మారింది. రాజముద్ర పత్రికలో సంచలన కథనానికి ఉద్యోగులు అధికారులు ఎవరు రాశారు ఎలా లీక్ అయింది అంటూ ఎంక్వయిరీలు తనిఖీలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసింది.

## వచ్చిన మార్కులు ఎన్ని..?

లక్షల రూపాయలు వసూలు చేసి అడ్డగోలుగా మెరిట్ లిస్టు ఎలా తయారు చేసారో.....! పూర్తి ఆధారాలతో సహ పార్ట్ ..3లో

మరో ప్రత్యేక కథనం త్వరలో...

# హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం

కేంద్రంలో అధికారంలోకి వస్తాం..
దేశాన్ని రక్షిస్తాం



- అబద్ధాల ప్రచారంలో మోడీ సిద్ధహస్తుడు
- విదేశీలు చుట్టే మోడీకి.. మణిపూర్ వెళ్లే తీరిక లేదు
- కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణం కార్యకర్తలేనని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఇలా అందరూ కలిసికట్టుగా భారత రాష్ట్ర సమితిని ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 'కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి' సభలో ఖర్గే మాట్లాడారు. హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందిస్తోంది. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.8,200 కోట్లు జమ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోంది అన్నారు.

**హైదరాబాద్, జులై 4 :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి వచ్చిన ట్లే.. కేంద్రంలో సై తం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీ రుతుందని ఏఐసీసీ అధ్యక్షులు, ఎంపీ మల్లికార్జున్ ఖర్గే విశ్వాసం వ్య క్తం చేశారు. దేశరక్షణ కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆయన పురుద్ఘా టించారు. విదేశాలు తిరుగుతున్న మోడీ, మణిపూర్‌కు మాత్రం ఇప్పటి వరకు వెళ్లలేదని అన్నారు. దేశ ప్రజ లకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబ ద్ధాలేనన్నారు.

మిగతా 2 లో



# ఆత్మాభిమానం మన ఆయుధం

(మొదటిపేజీ తరువాయి)

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో క్షత్రియ సేవా సమితి భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రాజ్‌నాథ్ మాట్లాడారు. గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు అనేక పోరాటాలు చేశారని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో బ్రిటిష్ వారితో ఆయన పోరాడారని గుర్తుచేశారు. భారత్ కోసం అల్లూరి సీతారామరాజు లాంటి గొప్ప వీరుడిని ఆంధ్రప్రదేశ్ ఇచ్చింది. అడవి నుంచి విప్లవం పుట్టించి బ్రిటిష్ వారిని గజగజలాడించిన వ్యక్తి అల్లూరి అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో ఆధునిక ఆయుధాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి ఆయన. బానిసత్వంతో కాదు ఆత్మాభిమానంతో బతకాలనేది ఆయన నుంచి మనం నేర్చుకోవాలి. అడవి బిడ్డల కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారు. ఆయన పుట్టిన గ్రామాన్ని పర్యటక ప్రాంతంగా తీర్చి దిద్దుతున్నామని అని రాజ్‌నాథ్ అన్నారు. బాలికల చదువు కోసం పాఠశాల ల అభివృద్ధి జరుగుతుంది.. 108 సూర్య నమస్కారాలు కేవలం దేహం దారుఢ్యం కోసం కాదు.. మానసిక అభ్యున్నతికి ఉపయోగపడతాయి.. క్రమంగా అడవులు నక్సల్స్ కు అడ్డంగా మారాయి.. ఇప్పుడు నక్సల్స్ పూర్తిగా తుడిచిపెట్టుకు పోతున్నాయి.. ఆగస్టు 2026లోపే నక్సల్స్ ను తుడిచి పెట్టేస్తాం.. నక్సల్స్ చేతిలో బంధీగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి వేగంగా జరుగుతోంది.. వేగంగా గ్రోత్ కారిడార్ లుగా అభివృద్ధి చెందుతున్నాయి.. కనీసం నెట్వర్క్ లేకపోయేది.. టీ–వీలు, ల్యాప్ టాప్ లు, మొబైల్ టవల్ లు కూడా లేకుండాపోయాయి.. 8 వేల టవర్లను ప్రారంభించేం దుకు సిద్ధం గా ఉన్నాయని రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. పహెల్గామ్ లో దాడి తరువాత ఆపరేషన్ సింధూర్ తో ధైర్యం, ధర్మం, ఖర్మను పరిచయం చేశామని రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పుకొచ్చారు. రామాయణంలో హనుమంతుడు చేసిన పనే ఇప్పుడు మనం చేశాం.. మనల్ని ఎవరు చంపారో వారిని మాత్రమే చంపాం.. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరిగితే తగిన సమాధానం చెబుతాం.. న్యాయం అందిరికీ సమానంగా దక్కాలి.. హనుమాన్ స్ఫూర్తిగా 'ఆపరేషన్ సిందూర్' కొనసాగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాకిస్థాన్‌తో పాటు–ప్రపంచానికి మనం బలమేంటో చూపించామన్నారు. పాక్ ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేశాం తప్ప.. పౌరులను కాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు షెకావత్, కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గనుల లీజ్ రెన్యువల్‌కు సింగిల్ విండో సిస్టం

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్:** 500 మినరల్ బ్లాక్స్‌లో లీజ్ రెన్యువల్ సులభతరం చేశామని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గనుల లీజ్ రెన్యువల్‌కు సింగిల్ విండో సిస్టం అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. కోల్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఖనిజాల ఉత్పత్తిలో కోల్ ఇండియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆత్మనిర్భర్ కోసం కోల్ ఇండియా అధిక ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. స్థానికుల జీవనోపాధికి ఇబ్బం ది లేకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. అత్యాధునిక సాంకేతికత వినియోగించి ఖనిజాలు ఉత్పత్తి చేస్తున్నట్టు చెప్పారు. అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో కూడా కోల్ ఇండియా అడుగుపెట్టిందని తెలిపారు.



# సిగాచీ పరిశ్రమలో పేలుడు..

## 39కి చేరిన మృతులు

**హైదరాబాద్:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో మృతుల సంఖ్య 39కి చేరింది. ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహారాష్ట్రకు చెందిన భీమ్‌రావు శుక్రవారం మృతి చెందారు. ఇప్పటి వరకు 31 మంది మృతదేహాలను గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ఇంకా ఏడుగురి మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. వివిధ ఆసుపత్రుల్లో 23 మంది చికిత్స పొందుతుండగా.. 9 మంది కార్మికుల ఆచూకీ లభించలేదు.



# పాకిస్థాన్‌కు 'మైక్రోసాఫ్ట్' బై బై..

**పాకిస్థాన్ :** ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థల్లో ఒకటైన మైక్రోసాఫ్ట్ పాకిస్థాన్‌లో తన కార్యకలాపాలను మూసివేసింది. దాదాపు 25 ఏళ్లపాటు అక్కడ సేవలు అందించిన ఈ టెక్ దిగ్గజం తాజాగా బై బై చెప్పింది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించనప్పటికీ.. ఆ సంస్థ పాక్ సీఈవో ప్రకటనతో ఈ విషయం బయటకు వచ్చింది. దాదాపు వేలాది మందికి మైక్రోసాఫ్ట్ లేఆఫ్‌లు ప్రకటిస్తున్న సమయంలోనే ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. "పాకిస్థాన్‌లో మైక్రోసాఫ్ట్ తన కార్యకలాపాలు అధికారికంగా మూసివేస్తున్నట్లు నాకు తెలిసింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కొద్దిమంది ఉద్యోగులకు ఈ సమాచారం అందింది. అలా ఓ శకం ముగిసింది" పాక్‌లో మైక్రోసాఫ్ట్ సీఈవో జవాద్ రెహ్మాన్ ప్రకటించారు. అయితే, ఈయన ఆధ్వర్యంలోనే మార్చి 7, 2000 మైక్రోసాఫ్ట్ అక్కడ కార్యకలాపాలను మొదలుపెట్టిం ది. వాణిజ్య కార్యకలాపాలే కాకుండా పాకిస్థాన్ డిజిటల్ జర్నీలో మైక్రోసాఫ్ట్ కీలకంగా వ్యవహరించింది. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటు చేసింది. విద్యాసంస్థలతో కలిసి పనిచేయడంతోపాటు చిన్న వ్యాపారులకు సాంకేతికతను దగ్గర చేసింది. ఇలా పాక్ యువతకు ఓ అవకాశాన్ని అందించేందుకు ప్రయత్నాలు చేశామని జవాద్ పేర్కొన్నారు.

# హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటి వరకు ప్రధాని మోదీ 42 దేశాలు తిరిగారని గుర్తు చేశారు. కానీ ప్రజలు చనిపోతున్నా.. మణిపూర్ మాత్రం ఆయన వెళ్లలేదని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను ఏదేదో చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించారన్నారు. కానీ ఎందుకు ఏం చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.

### మణిపూర్ ఈ దేశంలో భాగం కాదా?

ఇప్పటి వరకు ప్రధాని 42 దేశాలు తిరిగారు.. కానీ మణిపుర్ వెళ్లడానికి మాత్రం మనసు రాలేదు. ఆ రాష్ట్ర అంశంపై ఒక్కసారి కూడా ఆయన పెదవి విప్పలేదు. రాహుల్‌గాంధీ, నేను మణిపుర్ వెళ్లాం.. మోదీ మాత్రం వెళ్లలేదు. మణిపుర్ ఈ దేశంలో భాగం కాదా? మణిపుర్ వాసులు భారతీయులు కాదా? సెక్యులర్, సోషలిస్టు పదాలను ఆర్ఎస్ఎస్, భాజపా, మోదీ, అమిత్‌షా సహా ఎవరూ రాజ్యాంగం నుంచి తొలగించలేరు. మోదీజీ.. ముందు దేశ ప్రజల బాధలు వినండి.. ఆ తర్వాత విదేశాల సంగతి చూడొచ్చు. అఖిలపక్ష సమావేశానికి ప్రధాని రాలేదు.. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన బిజీగా ఉన్నారు" అని ఖర్గే విమర్శించారు.

### 11 ఏళ్లలో ప్రధాని మోడీ తెలంగాణకు ఏం తెచ్చారు..

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గతంలో చెప్పానని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. తమ పార్టీ పాలనలోనే రాష్ట్రానికి 50కి పైగా కేంద్ర ప్రభుత్వం సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక గత 11 ఏళ్లలో ఏం తెచ్చారని ప్రశ్నించారు. మోడీ ప్రజలకు చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలేనని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తోందని తెలిపారు. నిరుపేదలకు రేవంత్ సర్కార్ నాణ్యమైన సన్నబియ్యం అందిస్తుందని అన్నారు. రైతు భరోసా కింద రూ.8,200 కోట్లను అన్నదాత తల



ఖాతాల్లోకి జమ చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో తాము ఏం చెప్పామో.. అవన్నీ ప్రత్యక్షంగా చేసి చూపించామని మల్లికార్జున్ ఖర్గే అన్నారు.

### దేశంలో తొలిసారి కులగణన..

దేశంలో తొలిసారిగా కులగణన తెలంగాణలో జరిగిందని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. తెలంగాణ కులగణన దేశానికే ఓ రోల్ మోడల్‌గా నిలిచిందని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ హయాంలోనూ ఈ ప్రాంతం అభివృద్ధి చెందినదని.. తెలంగాణలో గత ప్రభుత్వం అత్యంత అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులను కేసీఆర్ నిలువునా మోసం చేశారని ఫైర్ అయ్యారు. నరేంద్ర మోడీ, అమిత్ షా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటుంన్నారని.. కానీ, అసలు వాళ్లు ఈ దేశానికి, తెలంగాణ చేసిందేమటని ప్రశ్నించారు. ఇప్పటికి మోడీ 42 దేశాలు తిరిగారని.. కానీ ఇంత వరకూ మణిపూర్ వెళ్లడానికి మాత్రం ఆయనకు మనసు రావట్లేదని అన్నారు. రాహుల్ గాంధీ, తాను కలిసి స్వయంగా మణిపూర్ వెళ్లి పరిస్థితులను తెలుసుకున్నామని గుర్తు చేశారు.

### మోడీ విదేశాంగ విధానం సరిగ్గా లేదు..

ఆపరేషన్ సిందూర్‌కు రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతును ఇచ్చిందని.. అఖిలపక్ష సమావేశానికి మాత్రం మోడీ రాలేదని అన్నారు. బిహార్ ఎన్నికల ప్రచారం బిజీగా ఉన్నారంటూ సెటైర్లు వేశారు. అదీ మోడీ దేశభక్తి.. అదీ మోడీ ఆలోచనా విధానమని మండిపడ్డారు. మణిపూర్ ఈ దేశంలో భాగంగ కాదా.. అక్కడి ప్రజలు భారతీయులు కాదా అని ప్రశ్నించారు. మోడీ జీ.. ముందు దేశ ప్రజల బాధలు వినండి.. తర్వాత విదేశాల సంగతి చూడవచ్చు అంటూ హితవు పలికారు. పాకిస్తాన్‌ను ఏదేదో చేస్తామంటూ గొప్పలు చెప్పారని.. యుద్ధాన్ని మధ్యలోనే ఎందుకు ఆపేశారని ప్రశ్నించారు. దేశం కోసం ఇందిర, రాజీవ్‌లు ప్రాణాలు అర్పించారని.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నుంచి ఒక్కరైనా ప్రణాలు అర్పించారా అని అన్నారు. గతంలో అమెరికా బెదిరించి ఇందిరా గాంధీ బెదరలేదని.. వారి హెచ్చరికలను బేఖాతరు బంగ్లాదేశ్ ఏర్పాటుకు సహకరించారని గుర్తు చేశారు. మోడీ విదేశాంగ విధానం సరిగ్గా లేదని, తప్పుడు విధానంతో అందరినీ శత్రువులుగా మార్చుకుంటున్నారని అన్నారు. జై బాపు, జై భీమ్.. జై సంవిధాన్ పేరుతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లాలని పిలునిచ్చారు. సెక్యూలరిజంను రాజ్యాంగం నుంచి ఆర్ఎస్ఎస్, మోడీ, అమిత్ షాలు ఎవరూ తీసివేయలేరని మల్లికార్జున్ ఖర్గే అన్నారు.

# రైతు సంక్షేమంపై చర్చిద్దాం రండి

- ఢిల్లీలో ఉండే మోదీ.. గల్లీలో ఉండే కేడీ అయినా చర్చకు సిద్ధం
- కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం
- ఎల్బీ స్టేడియం సామాజిక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, జులై 4 :** ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు గట్టి సవాల్ విసిరారు. కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా వెల్లడించారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణమాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఇది కాదని నిరూపించ గలరా అని సవాల్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని కోరారు. రైతుల కోసం 18 నెలల్లో రూ.1.04లక్షల కోట్లు ఖర్చు చేశాం. వరి వేస్తే ఉరి వేసుకున్నట్టేనని గత సీఎం చెప్పారు.. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించి దేశానికే ఆదర్శంగా నిలిచాం. రైతుభరోసాలో ప్రభుత్వం విఫలమవుతుందని కొందరు ఎదురు చూశారు.. కానీ వారి ఆశ నెరవేరలేదు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో.. ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం. చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి.. ఇలా ఎవరొచ్చినా సరే. కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నా.. పేదలు ఎప్పుడూ బర్రెలు, గొర్రెలు మేపుతూనే బతకాలా?కేసీఆర్, మోదీకి సవాల్ విసురుతున్నా. లెక్క కావాలంటే చెప్పండి.. అందర్నీ తీసుకొచ్చి స్టేడియంలో నిలబెట్టి లెక్కవేయిస్తా. 60వేలకు ఒక్కరు తక్కువ వచ్చినా కాళ్లు మొక్కి తప్పుకొంటా' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

### ఒడిదొడుకులు అధిగమించి ముందుకెళ్తున్నాం

"కాంగ్రెస్ నేతలు కలిసి ఉండలేరని.. ఈ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని కొందరు అన్నారు. కానీ.. పార్టీ నేతలంతా ఐకమత్యంతో పనిచేస్తూ ఆ అపోహలను పటాపంచలు చేశారు. జనగణనతో పాటు కులగణన.. ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాటిచ్చారు. హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించాం. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించాం. కష్టాలు, ఒడిదొడుకులు వచ్చాయి.. అన్నీ అధిగమించి ముందుకెళ్తున్నాం.

### చర్చకు ఎవరొస్తారో రండి..

రైతుల కోసం 18 నెలల్లో రూ.1.04లక్షల కోట్లు ఖర్చు చేశాం. వరి వేస్తే ఉరి వేసుకున్నట్టేనని గత సీఎం చెప్పారు.. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించి దేశానికే ఆదర్శంగా నిలిచాం. రైతుభరోసాలో ప్రభుత్వం విఫలమవుతుందని కొందరు ఎదురు చూశారు.. కానీ వారి ఆశ నెరవేరలేదు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో.. ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం. చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి.. ఇలా ఎవరొచ్చినా సరే. కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నా.. పేదలు ఎప్పుడూ బర్రెలు, గొర్రెలు మేపుతూనే బతకాలా?మేం తొలి ఏడాదిలోనే 60 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. కేసీఆర్, మోదీకి సవాల్ విసురుతున్నా. లెక్క కావాలంటే చెప్పండి.. అందర్నీ తీసుకొచ్చి స్టేడియంలో నిలబెట్టి లెక్కవేయిస్తా. 60వేలకు ఒక్కరు తక్కువ వచ్చినా కాళ్లు మొక్కి తప్పుకొంటా" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# లోకల్ పార్టీలకు ఈసీ షాక్

## గుర్తింపు రద్దు చేస్తామంటూ నోటీసులు

**హైదరాబాద్ :** తెలంగాణలో పలు రాజకీయ పార్టీలపై రాష్ట్ర ఎన్ని కల సంఘం (ఈసీ) కీలక చర్యలు చేపట్టింది. గత ఆరేళ్లుగా ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా, కేవలం రిజిస్టర్డ్ పార్టీలుగా మాత్రమే కొనసాగుతున్న 13 పార్టీలకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో స్పష్టమైన కారణాలతో వివరణ ఇవ్వాలని ఈ నోటీసుల్లో ఆదేశించింది. రాష్ట్రంలో ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ అయి ఉండి ఆరేళ్లకు పైగా ఏ ఎన్నికల బరిలోనూ నిలవని పార్టీలను జాబితా నుంచి తొలగించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగానే 13 పార్టీలను గుర్తించి చర్యలు ప్రారంభించింది. సంబంధిత పార్టీలకు నోటీసులు అందించే బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించింది. ఈ విషయంపై దినపత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇవ్వాలని కూడా జిల్లా అధికారులను ఆదేశించింది. ఆయా పార్టీల నుంచి వివరణ స్వీకరించిన తర్వాత, వాటి గుర్తింపును రద్దు చేయాలా వద్దా అనే దానిపై స్పష్టమైన సిఫార్సులతో కూడిన నివేదికను ఈ నెల 10వ తేదీలోగా సమర్పించాలని స్పష్టం చేసింది. జిల్లాల నుంచి అందిన నివేదికల ఆధారంగా తుది నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.




### నోటీసులు అందుకున్న పార్టీల వివరాలు

- తెలంగాణ కార్మిక రైతు రాజ్యం పార్టీ (హన్మకొండ)
- ఇండియన్ మైనారిటీస్ పొలిటికల్ పార్టీ (హైదరాబాద్)
- జాగో పార్టీ (హైదరాబాద్)
- నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (హైదరాబాద్)
- తెలంగాణ లోక్ సత్తా పార్టీ (హైదరాబాద్)
- తెలంగాణ మైనారిటీస్ ఓబీసీ రాజ్యం (హైదరాబాద్)
- యువ పార్టీ (హైదరాబాద్)
- బహుజన్ సమాజ్ పార్టీ (అంబేద్కర్–పూలే) (మేడ్చల్ మల్కాజిగిరి)
- తెలంగాణ స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ పార్టీ (మేడ్చల్ మల్కాజిగిరి)
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య సమితి పార్టీ (రంగారెడ్డి)
- జాతీయ మహిళా పార్టీ (రంగారెడ్డి)
- యువ తెలంగాణ పార్టీ (రంగారెడ్డి)
- తెలంగాణ ప్రజా సమితి (కిషోర్, రావు, కిషన్) (వరంగల్)

# సచివాలయ ముట్టడికి నిరుద్యోగుల యత్నం

**హైదరాబాద్, జూలై 4 :** రాష్ట్ర సెక్రటేరియట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 2 లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలండర్ విడుదల, మెగా డీఎస్సీ ప్రకటించాలని శుక్రవారం సచివాలయం ముట్టడికి నిరుద్యోగులు యత్నించారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు ర్యాలీగా వస్తున్న పలువురు నిరుద్యోగులను అడ్డుకోని మరీ పోలీసు వాహనాల్లో స్థానిక స్టేషన్‌లకు తరలించారు. అలాగే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడికి యత్నించారు. ర్యాలీగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ముట్టడికి యత్నించారు. అన్ని ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇవ్వాలని, జాబ్ క్యాలండర్‌ను అమలు చేసి ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ముట్టడి నేపథ్యంలో ఉదయం నుంచే సచివాలయం పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు.

# ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని బిహార్ ముద్దుబిడ్డ

(మొదటిపేజీ తరువాయి)

ఆ రాష్ట్ర వారసత్వం ప్రపంచానికే గర్వకారణమన్నారు. శతాబ్దాలుగా వివిధ రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య బలమైన స్నేహం ఉందన్నారు. ట్రినిడాడ్‌లోని పలు వీధులకు బనారస్, పట్నా, కోల్‌కతా, దిల్లీ వంటి పేర్లు ఉన్నాయన్నారు. ఇక్కడి భారతీయుల సాకారంతో దేశం సాంస్కృతికంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ నవరాత్రులు, మహాశివరాత్రి, జన్మాష్టమి వంటి వేడుకలను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారన్నారు. ఇరుదేశాల మధ్య స్నేహం మరింత బలంగా పెరిగిందన్నారు. భారత్ ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థ అని అన్నారు. మన అభివృద్ధి ప్రపంచానికి పరస్పర ప్రయోజనం చేకురేలా ఉండాలన్నారు. ప్రస్తుతం మన దేశంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ పర్యటన నేపథ్యంలో ఆ దేశ ప్రధాని కమ్లాకు పవిత్రమై మహాకుంభ్ జలంతో పాటు రామ మందిరం ప్రతిమను మోదీ బహుకరించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో ఒక చిన్న దేశం. భారత్‌లోని జోధ్‌పుర్ కంటే ఇది చిన్నదిగా ఉంటుంది. అయితే, ఇక్కడ భారత సంతతికి చెందిన ప్రజలు 40శాతం మంది ఉన్నారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను ఇప్పటికీ వారి ఆహారం, సంగీతం, భాషల్లో స్పష్టంగా కన్పిస్తాయి.

# నటి రన్యారావుకు షాక్..

## రూ.34 కోట్ల విలువైన ఆస్తులు జప్తు



**బెంగళూరు:** కన్నడ నటి రన్యా రావుకు ఈడీ గట్టి షాక్ ఇచ్చింది. బంగారం అక్రమ రవాణా వ్యవహారంతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన నటికి చెందిన రూ.34 కోట్లకు పైగా విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. ఈ విషయాన్ని ఈడీ అధికారులు వెల్లడించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద బెంగళూరులోని విక్టోరియా లేఅవుట్‌లోని నివాస భవనం, అర్కావతి లేఅవుట్‌లోని ఒక నివాస స్థలం, తుమకూరులోని ఇండస్ట్రియల్ భూమి, అనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని జప్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆస్తుల మార్కెట్ విలువ రూ.34.12 కోట్లు ఉంటుందని వెల్లడించారు. దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ మార్చి తొలి వారంలో రన్యారావు బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఆమె వద్ద నుంచి 14.7 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. గోల్డ్ స్మగ్లింగ్ రాకెట్‌పై సీబీఐ, డీఆర్ఐ అధికారుల ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆమెపై పీఎంఎల్ఏ కింద కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తోంది. గోల్డ్ స్మగ్లింగ్ సిండికేట్‌లో ఆమె చురుకైన పాత్రను గుర్తించిన ఈడీ.. తాజాగా ఆమె ఆస్తులను జప్తు చేయడం గమనార్హం.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# రోశయ్య అరుదైన రాజకీయవేత్త

- బడ్జెట్ సర్దుబాటులో ఆయనది అందెవేసిన చేయి
- 16సార్లు బడ్జెట్ సమర్పించిన ఘనత రోశయ్యది
- రోశయ్య జయంతి వేడుకల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్

**హైదరాబాద్, జులై 4 :** దేశంలో ఒక రాష్ట్ర ఆర్థికమంత్రిగా అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యదని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. అప్పులు చేయకుండా ఉన్నంతలో బ్జడెట్ ను సర్దుబాటు చేయడంలో రోశయ్యది అందెవేసిన చెయ్యని అన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కొరత లేకుండా సర్దుబాటు చేసిన ఘనత రోశయ్య గారిదని అన్నారు. నిండైన తెలుగు తనానికి ప్రతిరూపం రోశయ్య అని,. పంచెకట్టు, భుజంపై పై పంచెతో ఆకట్టుకునే ఆహార్యం రోశయ్యదని అన్నారు. స్వర్గీయ కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆద్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్పొరే షన్ చైర్మన్లు, నాయకులు, వైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సభా వేదికపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుని ప్రముఖులు సన్మానించారు.




గొప్ప రాజకీయ నేతకు దక్కిన గౌరవం

ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషం. గొప్ప రాజకీయ నేతకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రెడ్డికి, రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులకు నా అభినందనలు తెలుపుతున్నానని అన్నారు అదేవిధంగా ఈరోజు వారి విగ్రహాన్ని నెలకొల్పి ఆవిష్కరించడం ద్వారా రోశయ్య గారి గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు వారి తెలియజేయడం జరిగిందన్నారు. ఇక వాక్పటిమ, వాగ్దాటి, చతురతలో రోశయ్య గారితో ఇంకొకరిని పోల్చలేం. కాంగ్రెస్ ప్రభుత్వంలో గవర్నర్ గా నియామకం అయ్యి బిజేపి ప్రభుత్వంలో కూడా కొనసాగిన అరుదైన వ్యక్తులలో రోశయ్య గారు ఒకరు. రాజకీయ విభేదాలు ఉండవచ్చు కానీ వ్యక్తిగతంగా అందరికీ ఆజాత శత్రువు రోశయ్య గారని అన్నారు. రోశయ్య గారిది మన తెలంగాణ ప్రాంతం కాకపోయినా వారిని మనం గౌరవించడానికి కారణం మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం వారి పెద్దరికానికి గౌరవం ఇవ్వడమేనని అన్నారు. రోశయ్య గారు శాసనసభలో మాట్లాడుతుంటే స్వపక్షంతో పాటుగా విపక్షాలు కూడా ఏకాగ్రతతో వినేవాళ్ళు. యువ, నూతన శాసన సభ్యులకు రోశయ్య గారి ప్రసంగం ఒక పుస్తకం. 2008 ఉప ఎన్నికలలో నేను మొదటిసారి శాసనసభ్యునిగా ఎన్నికై అసెంబ్లీకి వచ్చినప్పుడు సమావేశాలో రోశయ్య గారి ప్రసంగాలను ప్రత్యేక్షంగా వినే భాగ్యం కలిగింది, వారి ప్రసంగాలకు నేను అభిమానిని.వారి నుండి నేను ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. నేటి యువ రాజకీయ నాయకులు రోశయ్య గారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తున్నానని గడ్డం ప్రసాద్ అన్నారు.



## యశోద ఆసుపత్రికి ఎమ్మెల్సీ కవిత

### కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా

**హైదరాబాద్:** భారాస ఎమ్మెల్సీ కవిత యశోద ఆసుపత్రికి వెళ్లారు. తన తండ్రి కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. జ్వరం, మధుమేహ సమస్యలతో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఆయన్ను కవిత పరామర్శించారు. గురువారం సాయంత్రం కేసీఆర్ సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరారు. గత రెండు రోజులుగా కొంత నీరసంగా ఉండడంతో కేసీఆర్ గురువారం ఆసుపత్రికి వచ్చారు. ఆయనను పరీక్షించిన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ ఎంవీ రావు సూచనతో ఆసుపత్రిలో చేరారు. వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వర్గాలు గురువారం రాత్రి 9.30 సమయంలో బులెటిన్ విడుదల చేశాయి. "నీరసంతో బాధపడుతూ కేసీఆర్ ఆసుపత్రిలో చేరారు. ప్రాథమిక పరీక్షల్లో రక్తంలో షుగర్ స్థాయులు అధికంగా, సోడియం స్థాయులు తక్కువగా ఉన్నట్లు తేలింది. కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉంది. షుగర్, సోడియం సాధారణ స్థాయికి వచ్చే వరకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతారు' అని హెల్త్ బులెటిన్‌లో డాక్టర్ ఎంవీ రావు పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు ఆయనతోపాటు ఉన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.

## రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్

### అల్లు అరవింద్‌ను విచారించిన ఇడి



**హైదరాబాద్, జులై 4 :** ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవిం ద్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరే ట్ అధికారులు ప్రశ్నించారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్‌లో అరవింద్‌ను మూ డు గంటలపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. 2018 – 2019లో జరిగిన బ్యాంక్ స్కామ్‌లో ఈడీ విచారణను కొనసాగిస్తోంది. ఇందులో మనీలాండరింగ్ కోణం ఉందని భావించిన ఈడీ.. ఈసీఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణను చేపట్టింది. గతంలో బ్యాంక్‌కు సంబంధించి అవకతవకలు జరిగాయన్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతోంది. ఇప్పటికే అల్లు అర వింద్‌ను విచారిం చిన అధికారులు.. బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారం మరోసారి విచారణకు రావాలని నిర్మాతను ఈడీ అధికారులు ఆదేశించారు. 2024లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లోని వివిధ ప్రదేశాలలో సోదాలు చేసిన ఈడీ.. రూ.1.45 కోట్లను సీజ్ చేసింది. నిందితులు రూ.101.48 కోట్ల రుణ నిధులను మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలకు సంబంధించి ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇందులో అకౌంట్ హోల్డర్స్‌గా ఉన్న వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ యాజమాన్యం ఎలాంటి ని బంధనలు పాటించకుండా, ఆర్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ.100 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాల పై ఈడీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

# గ్రూపులు కడితే సహించబోము

- మీనాక్షితో అంతా సమన్వయం చేసుకోవాలి
- పార్టీ వ్యవహారాలపై బయట మాట్లాడరాదు
- కాంగ్రెస్ నేతలకు మల్లికార్జున ఖర్గే హెచ్చరిక
- మంత్రుల సమన్వయ లోపంపై సీఎం అసహనం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపైనా నేతల చర్చ
- టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో వాడీవేడీగా చర్చ

**హైదరాబాద్, జులై 4 :** పార్టీలో అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. కొత్తపాత తేడా వద్దని.. త్వరలో అన్ని కమిటీల నియామకం పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక ఎన్నికలపై గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశమైంది. తొలుత పాశమైలారం ఘటనపై నేతలు సంతాపం తెలిపారు. అనంతరం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై చర్చించారు. జై బాపు–జై భీమ్–జై సంవిధాన్ కార్యక్రమాలపై సమాలోచనలు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి , కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీ–పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

### పార్టీ వ్యవహారాలపై బయట మాట్లాడరాదు

ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ పార్టీకి సంబంధించిన అంశాలపై బయట ఎలాంటి విమర్శలు చేయొద్దని.. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమన్వయం చేయాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని కొందరు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల వ్యవహార శైలిపై సీరియస్ అయ్యారు. నలుగు రైదుగురు గ్రూపులు కడితే భయపడతారు అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించే నేతలను రాహుల్ గాంధీ.. నేను పట్టించుకోమని తేల్చి చెప్పారు.

### మంత్రుల సమన్వయ లోపంపై సీఎం అసహనం

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులపై మరోసారి



అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా మంత్రులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ కొత్త, పాత నేతల మధ్య సమన్వయం లేదన్నారు. కొత్తగా వచ్చినవారు పాతవారితో కలిసి వెళ్తే పార్టీ బలం పెరుగుతుందని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఉప ఎన్నికలో మూడు పార్టీలు కలిసి బరిలోకి దిగుతాయని చెప్పుకొచ్చారు. ఉప ఎన్నికను సమర్థవంతంగా ఎదుర్కొవాలని దిశానిర్దేశర చేశారు. ఇన్‌చార్జీ మంత్రులు ప్రతి అంశాన్నీ సీరియస్‌గా తీసుకోవాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశర చేశారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ పదవులు వెంటనే భర్తీ చేయాలన్నారు. పార్టీ కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని హుకుం జారీ చేశారు. పార్టీ పదవులు భర్తీ చేయడంలో టీ–పీసీసీ చీఫ్ ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. లోకల్ బాడీ ఎన్నికల్లో నేషనల్ నరేటివ్ బిల్డప్ చేసుకోవాలని సూచించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలోనే అన్నిరాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కేంద్రప్రభుత్వం మెడలు వంచి జనగణనలో కులగణన చేసేలా చేయడంలో మనం విజయం సాధించామని వ్యాఖ్యానించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో మనం చాలా విజయాలు సాధించామని చెప్పుకొచ్చారు. తాను టీ–పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 45 లక్షల మందితో క్రియాశీలక సభ్యత్వం చేయించానని గుర్తుచేశారు. యూత్ కాంగ్రెస్, పార్టీ జిల్లా అధ్యక్షుల్లో చాలా మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవులు వరించాయని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## తెలంగాణ ప్రయోజానాలపై రాజీపడం

- గతంలోనే పదవులను గడ్డిపోచల్లా వదిలేశాం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



**హైదరాబాద్, జూలై 4 :** నాడైనా నేడైనా తెలంగాణ ప్రయోజనాల ముందు పదవులు బీఆర్‌ఎస్‌కు తృణప్రాయం అని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బనకచర్లతో ఏపీ అప్పనంగా నీళ్ళు దోచుకుపోతా అంటే చూస్తూ ఊరుకోం అని ఆయన హెచ్చరించారు. పోలవరం, పోతిరెడ్డి పాడు, పులిచింతల వంటి ఏపీ అక్రమ ప్రాజెక్టులను నిరసిస్తూ 20 ఏళ్ల క్రితం ఇదే రోజున మంత్రి పదవులకు రాజీనామాలు చేశాం. కేసీఆర్ ఆదేశానుసారం.. ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ నీటి హక్కుల కోసం పదవులను గడ్డిపోచలుగా భావించి వదులుకున్నం. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో.. ఆంధ్రప్రదేశ్ బనకచర్ల పేరిట గోదావరి నీళ్ల దోపిడి చేస్తానంటే చూస్తూ ఊరుకుంటామా? అని హరీశ్‌రావు నిలదీశారు. నాడైనా, నేడైనా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తీసే ఏ కుట్రలనైనా బీఆర్‌ఎస్ పార్టీ సహించదు. పదవులకు రాజీనామాలు చేయడం మాత్రమే కాదు, పేగులు తెగేదాకా కొట్లాడుతం. తెలంగాణకు అన్యాయం జరగకుండా కాపలా ఉంటం. కంటికి రెప్పలా ఉండి కాపాడుకుంటం. ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే.. పొలిమేర దాకా తరిమికొడతాం.. ప్రాంతంవాడే ద్రోహం చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తం అని హరీశ్‌రావు హెచ్చరించారు. జై తెలంగాణ.. జై కేసీఆర్.. అని హరీశ్‌రావు నినదించారు.



## జూరాలకు భారీగా వరదనీరు

### 14 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**గద్వాల, జూలై 4 :** ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానది పరీవాహక ప్రధాన జలాశయాలు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని జలకళను సంతరించు కున్నాయి. శుక్రవారం ఎగువ ప్రాంతం నుండి జూరాలకు 1,15,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా... ప్రాజెక్టు 14 గేట్లు దిగువకు 95,566 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాల కుడి, ఎడమ కాలువలు, బీమా లిఫ్ట్ 1, విద్యుత్ ఉత్పత్తికి, కోయిల్ సాగర్ సమాంతర కాలువలకు అన్నింటికీ కలిపి 1,27,659 క్యూసెక్కులకు వదులుతున్నట్లు– జూరాల వరద నియంత్రణ కార్యాలయ అధికారులు తెలిపారు. శుక్రవారం ఆల్మట్టి జలాశయం పూర్తిస్థాయి మట్టం 129.72 టిఎంసిలకు గాను 90.91 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 94,767 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా అంతే మొత్తంలో దిగువకు 1,00,670 క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 37.646 టిఎంసిలకు గాను 30.98 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుండి 99,583 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 99,583 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. జూరాల జలాశయం 9.667 టిఎంసిలకు గాను 7.991 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణ పూర్ జలాశయాలు పూర్తిస్థాయి నీటి మట్టంతో కళకళలాడుతుండడంతో అక్కడి ప్రాజెక్టుల నుండి వస్తున్న వరద నీటితో జూరాల వద్ద జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకొని జూరాల ప్రాజెక్టులపై ఆధారపడి నిర్మించిన ఎత్తిపోతల పథకాలకు అధికారులు నీటి విడుదలను కొనసాగిస్తుండడంతో ఆయకట్టు– రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# ఖమ్మం-వరంగల్ రహదారిపై ఘోర ప్రమాదం

### రెండు లారీలు ఢీకొని మంటల్లో ముగ్గురు దహనం

**మహబూబాబాద్, జూలై 4 :** ఖమ్మం – వరంగల్ హైవేపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరిపెడ శివారు కుడియాతండా వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో లారీ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ముగ్గరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్ మృతి చెందారు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో మంటలు ఆర్పివేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఘటన వివరాల్లోకి వెళితే రెప్పపాటులో మూడు నిండు ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగి ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ మృత్యువాత పడ్డారు. ఈ హృదయ విదారక ఘటన మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట స్టేజి సమీపంలోని జాతీయ రహదారి 563పై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం, జోద్‌పూర్, కేజర్ల ప్రాంతానికి చెందిన రాజురాం చౌదరికి ఇద్దరు కుమారులు. లారీ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అందులో భాగంగానే చేపల దాణా కోసం విజయవాడ వెళ్లిన తండ్రి, చిన్న కుమారుడు సర్వణ్ రాం (23) రెండు లారీలతో విజయవాడ నుంచి రాజస్థాన్‌కు లారీలతో బయల్దేరారు. కుమారుడు లారీ ముందు వస్తుండగా పది నిమిషాల వ్యవధిలో తండ్రి లారీ వెనుక నుంచి వస్తోంది. అదే క్రమంలో వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, నల్లబెల్లి పరిధిలోని రాంనాథ్ తండాకు చెందిన గుగులోత్ గణేష్ (30) కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడుతో కాకినాడకు వెళు తున్నాడు. మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట స్టేజీ సమీపంలో సర్వణ్ రాం నడుపుతున్న లారీ అదుపుతప్పి ఎదురుగా



వస్తున్న కరీంనగర్ నుంచి కాకినాడకు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాళ్లు క్యాబిన్లపైకి దూసుకు రావటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి డ్రైవర్లు గుగులోత్ గణేష్, సర్వణ్, రాం క్లీనర్ బర్గత్ ఖాన్ (23) సజీవ దహనమయ్యారు. స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది ఘటనా ÷–ధస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో కొడుకు లారీ వెనకాలే వస్తున్న తండ్రి రాజురాం చౌదరి తన కుమారుడి వాహనం ప్రమాదానికి గురైనట్లు– గుర్తించాడు. మృతుడు గణేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. క్లీనర్ బర్గత్ ఖాన్‌కు కూడా ఇటీవలే వివాహమైనట్లు– తెలుస్తోంది. జాతీయ రహదారిపై లారీలు దహనమవుతుండటంతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిపోయాయి. రాకపోకలకు అంతరాయం కలుగకుండా అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.పోలీసులు కేసు నమోదు చేశారు.



## హైడ్రా కూల్చివేతలను అడ్డుకున్న కార్పోరేటర్



**హైదరాబాద్, జూలై 4 :** హైడ్రా కూల్చివేతలను అడ్డుకున్న కార్పోరేటర్ అడ్డుకు న్నారు. హైదరాబాద్‌లోని లింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ ప్రాంతంలో హైడ్రా ఆధ్వర్యంలో నాలా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ పనులను అడ్డుకున్నారు. హైడ్రా అధికా రులతో వాగ్వాదానికి దిగారు. నాలాలోకి వచ్చిన భవనాలు కూల్చకుండా సోమేశ్వరాలయానికి సంబంధించిన భూమి స్వాధీనం చేసుకొని నాలా నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అందుకు దేవాదాయ శాఖ అధికారిణి భారతి ఆక్షేపించారు. నాలా ఆక్రమించిన వారిని వదిలేసి దేవాలయ భూమిని ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ విషయంలో కార్పొరేటర్‌ను కలగజేసుకోవద్దని కోరారు. చర్చలు సాగుతున్న క్రమంలో కూల్చివేతలు తాత్కాలికంగా ఆగిపోయాయి.

## అనిరుద్ వ్యాఖ్యలపై పిసిసి సీరియస్

**హైదరాబాద్, జూలై 4 :** జడ్చర్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిపై పీసీసీ సీరియస్ అయింది. అనిరుద్ రెడ్డి వ్యాఖ్యలపై నివేదిక ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీకి టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జరిగే క్రమశిక్షణ కమిటి సమావేశం లో అనిరుద్ రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఇటీవల జడ్చర్లలో కీలక కామెంట్స్ చేసిన అనిరుద్ రెడ్డి. తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారని వ్యాఖ్యాలు చేశా రు. ఇరిగేషన్, రోడ్ల కాంట్రాక్టులు అవ్వడం మానేస్తే.. అం తా సెట్ అవుతుందన్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పేర్కొన్నాడు.

రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# కలవరపెడుతున్న ఉద్యోగ రంగం!



ఐటి రంగం ఎంతగా ఊరిస్తుందో..అంతగా క్షోభ పెడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఐటి ఉద్యోగులకు ఉన్నపళంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. ఇటీవలల కాలంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల నుంచి తొలగించేస్తున్నారు. స్కిల్ లేకపోవడం కన్నా..ఖర్చులు తగ్గించుకునే ఉద్దేశ్యంతో తొలగిస్తున్నారు. పేరు ప్రతిష్టలు ఉన్న కంపెనీలే ఇలా చేస్తున్నాయి. జీతం ఎక్కువగా ఉన్న ఉద్యోగులనే టార్గెట్ చేస్తున్నారు. దీంతో ఉన్న ఉద్యోగం ఊడిపోవడంతో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిజంగానే ఖర్చు తగ్గించుకునే పద్ధతిలో వారిని పిలిచి జీతంలో కోతలు విధించి, వారిని కొనసాగించవచ్చు. కానీ ఆలా జరగడం లేదు. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య కొండంతగా ఉంటే చర్యలు మాత్రం గోరంత అన్నచందంగా ఉన్నాయి. మరోవైపు ఐటి కంపెనీల్లో తీసివేతలు పెరుగుతున్న తీరు తీవ్రంగా కలవరపెడుతోంది. ఉద్యోగం పోయినా బతకవచ్చన్న ధీమా లేకుండా పోతోంది. దానికి ఏదైనా రంగంలో రాణించే బహుముఖ ప్రావీణ్యం ఉండడం లేదు. పనిచేసుకునే పరిస్థితులు కూడా లేకపోవడం చూస్తున్నాం. నిజానికి క్షేత్రస్థాయి లోనే విద్యారంగంలో మార్పులు రావాలి. విద్యార్థులు రాటుదేలేలా తర్ఫీదు ఇవ్వాలి. వారు ఎంచుకంటున్న ఆయా రంగాల్లో నిష్ణాతులను తయారు చేయాలి. అప్పుడే వారు ఏ పరిశ్రమలో అయినా, ఉపాధి రంగంలో అయినా రాణిస్తారు. విద్యావిధానంలో మార్పుల తోనే ఇది సాధ్యం. కేవలం బట్టీ చదువుల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు లోపిస్తున్నాయి. నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేలా మార్కెట్ విస్తరించాలి. ఉద్యోగమంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగమే కాదు.. ప్రైవేట్ రంగంలోనూ వారికి అవకాశాలు కల్పించాలి.

అలాగే సొంతకాళ్ల మీద నిలబడేలా ఉపాధికి అవకాశాలను పెంచాలి. బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ సాకారం కావాలంటే వ్యవసాయరంగం, అనుబంధ రంగాలు బలపడాలి. పారిశ్రామిక రంగం పురోగమించాలి. ఇవన్నీ కూడా ఓ క్రమద్ధతిలో అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. ఎంతసేపు పెన్షన్లు పంచడం, కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం, ఇందిరమ్మ ఇళ్లు కట్టించడం ఇదే అభివృద్ధి కాదు. ప్రజలు తమకాళ్లమీద తాము నిలబడగలిగేలా వాతావరణం సృష్టించాలి. ఇది ప్రభుత్వాల బాధ్యత. యువత ఆకాంక్షల మేరకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాల విధానాలు ఉండాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ రాష్ట్రంలో క్వాంటమ్ గురించి సిఎం చంద్రబాబు మాట్లాడుతున్నారు. తెలంగాణ సిఎం రేవంత్ స్కిల్ వర్సిటీ అంటున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగుగా పనిచేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో సిఎం సహా మంత్రులు అమెరికా తదితర దేశాలు చుట్టివచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానాలు పలికారు. ఎపి మంత్రి లోకేశ్ దావోస్ తదితర ప్రాంతాలను సందర్శించారు. ఉన్న వనరులతో ఏం చేయవచ్చన్నది ముందుగా తేల్చుకోవాలి. సహజవనరులు ఉన్నాయి. సముద్రతీరం ఉంది. ఇవన్నీ కూడా ఉపాధికి పెద్ద అభివృద్ధి కేంద్రాలు.

ఇరు రాష్ట్రాల సిఎంలు పారిశ్రామక వేత్తలకు రెడ్ కార్పెట్ పరిచారు. ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు త్వరగా అందుబాటులోకి రావాలి. పన్నులు సరళీకరణ సాగాలి. చిన్నచిన్న పనులను పెంచాలి. కంపెనీలకు మేలు చేసేలా నిర్ణయాలు కాకుండా, ప్రజలకు మేలు చేసేలా విధానాలు ఉండాలి. ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారుతున్నారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. గంగవరం పోర్టు, పోలవరం ప్రాజెక్ట్, ఫార్మాసిటీల లాంటి వాటికోసం, విశాఖ ఉక్కు కోసం భూములు త్యాగాలు చేసిన వారు రోడ్డున పడుతున్నారు. ఇలాంటి ఘోరాలు జరక్కుండా దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. తెలంగాణలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి వాటికి భూములు ఇచ్చిన రైతులు ఇవాళ దిక్కులేకుండా పోయారు. ఇలాంటి అభివృద్ధి ఎవరి కోసమన్నది కూడా ఆలోచన చేయాలి. భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను కూడా గుర్తించని కంపెనీలు వారిని కార్మికులుగా కూడా గుర్తించడంలేదు. ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. ప్రైవేట్ పరిశ్రమల్లో తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. అంటే వెట్టి చాకిరీ చేయించుకునే వ్యవస్థను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. సిగాచీ పరిశ్రమలో జరిగిన దారుణమే ఇందుకు నిదర్శనం. పరిశ్రమలను ప్రోత్సహించి, ఆరోగ్యకర వాతావరణంలో ఉద్యోగ, ఉపాధి రంగాలను ప్రోత్సహిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు.

ఆయా కంపెనీల్లో వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని ప్రభుత్వాలు చెప్పటం లేదు. నిజానికి పరిశ్రమలు పెట్టేది ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికే అని గుర్తించాలి. అలాగు భూముల్లో బంగారం పండించేలా రైతులను ప్రోత్సహించాలి. వ్యవసాయ అనుబంధరంగాలను ప్రోత్సహించాలి. ఉద్యోగ,ఉపాధి రంగాలకు పెద్దపీట వేసినప్పుడే స్వయం సమృద్ధి సాధ్యం కాగలదు.

# దక్షిణాదిపై గురిపెట్టిన బిజెపి

- తొలి ప్రయత్నంగా మహిళా అధ్యక్షురాలు
- ముందువరసలో నిర్మలా సీతారామన్, వానతీ శ్రీనివాసన్



**న్యూఢిల్లీ, జూలై 4 :** సంస్థాగత ఎన్నికల పక్రియను భారతీయ జనతా పార్టీ వేగంగా ముందుకు తీసుకుని వెళ్తున్న వేళ కొన్ని ఆసక్తికర అంశాలు తెరపైకి వస్తున్నాయి. ప్రధానంగా దక్షిణాదిలో పాగా వేయాలన్న బలమైన కోరికతో ఉంది. ఉత్తరాది పార్టీ అన్న ముద్రను తొలగించుకునే క్రమంలో వేస్తున్న అడుగులు ఇప్పుడు జాతీయ అధ్యక్ష పదవి విషయంలో ఆయరించే ప్రయత్నాలు మొదలయ్యాని తెలుస్తోంది. బిజెపి సాహసాలు చేయడంలోను, ప్రయోగాలు చేయడంలోనూ ముందుంటుంది. దీనితో ఏ పార్టీ పోటీపడలేదు. కాంగ్రెస్‌లో ఇందిర కుటుంబ వారసత్వమే కొనసాగుతుంది. ప్రాంతీయ పార్టీల్లో కూడా వారసత్వ రాజకీయా లే ఉంటాయి. ఈ వాసనలు లేకుండా మనగలుగు తున్న పార్టీ బిజెపి మాత్రమే. ఇందులో చేరిన సామాన్యులు కూడా అసామాన్యులుగా ఎదిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈసారి దక్షిణాది నుంచి పార్టీ అధ్యక్ష పదవిని ఎంచుకునే విషయాన్ని పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. అందులోనూ మహిళలయితే మంచిదనే భావనా ఉంది. దీనికితోడు ఉత్తర, దక్షిణ భారతాలు కలుపుతూ...భాషా పరంగా నైపుణ్యాలు ఉండేవారిని కూడా వెతుకుతున్నారని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే నిర్మలా సీతారామన పేరు తాజాగా తెరపైకి వచ్చింది. ఆమె హిందీ, ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లాడడమే గాకుండా కఠినంగా పరిశ్రమ చేయగలరు. ఇకపోతే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికను నిర్వహించాలంటే కనీసం 19 రాష్ట్రాల్లో బిజెపి సారథుల నియామకాలు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో అధ్యక్షులను ఖరారు చేశారు. ఈ క్రమంలో ఇటీవలే అనేక రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ అధ్యక్షుల ఎంపిక సాగింది.

### తెలంగాణకు రామచంద్రరావు, ఎపికి మాధవ్

తెలంగాణకు రామచంద్రరావు, ఎపికి మాధవ్‌లు ఎంపికయ్యారు. వీరిద్దరూ పార్టీకి అంకితమై పనిచేస్తున్నవారే. ఇక్కడ కులాల కన్నా పార్టీకి అంకితమై ఉన్నవారినే గుర్తించారు. ఇలా అధ్యక్షుల ఎంపిక పూర్తయిన తర్వాత పార్టీ నిబంధనల ప్రకారం జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది. ఈసారి భాజపా జాతీయ అధ్యక్ష పదవిని దక్షిణాదికి మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ ఊహాగానాలు వస్తున్నాయి. ఎందుకంటే దక్షిణాదిపై గురిపెట్టిన బిజెపి ఇలా చేయడంలో ఆశ్యర్యం లేదు. గతంలో వెంకయ్య నాయుడు పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. తరవాత ఉపరాష్ట్రపతి కూడా అయ్యారు. జాతీయ అధ్యక్ష పదవి రేసులో పరధానంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరూ తమిళనాడుకు చెందిన వారే కావడం గమనించాలి. అలాగే పార్టీలో మహిళలకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో కూడా దక్షిణాది నుంచి మొట్టమొదటి మహిళా నాయకురాలిని ఎన్నుకునేం దుకు ఆలోచనలు చేస్తున్నారని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి.

### నిర్మలా సీతారామన్ మొదటి స్థానంలో..

ఈ క్రమంలో భాజపా అధ్యక్ష పదవి రేసులో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మొదటి స్థానంలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. పార్టీలోని అత్యంత ప్రభావవంతమైన మహిళల్లో ఆమె ఒకరు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంలో 2019లో తొలిసారి నిర్మలమ్మ ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి.. ఇప్పటికీ అదే పదవిలో కొనసాగుతున్నారు. ఆర్థికమంత్రిగా విమర్శలు వచ్చినా ఆమె దీటుగా జవాబిస్తున్నారు. ఓ రకంగా ఆమె మంచి వక్త కావడం కూడా కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా స్థానంలో ఆమె ఎంపిక సరైనదేనని అంటున్నారు. ఇకపోతే భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు, తమిళనాడు ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్1993 నుంచి భాజపాలో కొనసాగుతున్నారు. ఆమె 2021 ఎన్నికల్లో.. నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు అయిన కమల్ హాసన్‌ను ఓడించి కోయంబత్తూర్ (దక్షిణ) స్థానాన్ని గెలుచుకున్నారు. 2022లో భాజపా కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఆమె కూడా ఈరేసులో ఉన్నారు. తమిళనాడులో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇక్కడ పాగా వేసేందుకు బిజెపి కసరత్తు చేస్తోంది. అన్నామలైని తప్పించాలన్న డిమాండ్‌ను కూడా అంగీకరించింది. స్టాలిన్ ప్రభుత్వాన్ని సాగనంపే క్రమంలో ఈ ప్రయత్నాలు ఫలించవచ్చని అంటున్నారు. ఒకవేళ ఇదే జరిగితే ఇతర పార్టీలకు ఇది ఓ చెంపపెట్టు కాగలదు. అలాగే బిజెపి చేస్తున్న కసరత్తు కూడా ప్రజల్లో ప్రభావం చూపగలదని భావిస్తున్నారు.

# విషం చిమ్ముతున్న దేశద్రోహులు

- సోషల్ మీడియా వేదికగా విద్రోహ ప్రచారం
- అలాంటి వాటిని మూసేసేందకు కేంద్రం చర్యలు

**న్యూఢిల్లీ, జులై 4 :** ఈ దేశంలో ఉంటూ.. ఈ దేశం తిండి తింటూ.. ఇక్కడ సౌకర్యాలు అనుభవిస్తూ.. పక్క దేశాలకు సపో ర్టు చేస్తున్న వారు చాలా మందే ఉన్నారు. సోషల్ మీడియాలో సొంత దేశానికి వ్యతిరేకంగా పోస్టులు సైతం పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అలాంటి వారికి బుద్ధి చెప్పడానికి సిద్ధమైంది. కేంద్ర హోం శాఖ కొత్త పాలసీ తేబోతోంది. ఈ పాలసీ గనుక అమలైతే దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టే వారికి చుక్కలు కనిపించనున్నాయి. ఈ పాలసీలో భాగంగా దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పెట్టే వీడియో, ఇతర కంటెంట్‌ను గుర్తించనున్నారు. వాటిని బ్లాక్ చేయనున్నారు. ఆ కంటెంట్ పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. దేశానికి వ్యతిరేకంగా కంటెంట్ ఉండే వెబ్ సైట్లపై కూడా చర్యలు ఉండనున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇంటెలిజెన్స్ ఏజెన్సీలోని అత్యున్నతాధికా రులు యాంటీ నేషనల్ పోస్టుల గురించి హోమ్ మినిస్ట్రీకి చెప్పా రట. ఈ నేపథ్యంలోనే కేంద్ర కొత్త పాలసీ తేవాలని చూస్తోందని తెలుస్తోంది. దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిని, వ్యతిరేకంగా పని చేసే వారిని గుర్తించడానికి కేంద్రం ఓ టీమ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ టీమ్ దేశ వ్యతిరేక కార్యాకలాపాలపై దృష్టి పెడుతుంది. ఖలిస్తానీ టెర్రరిస్ట్ గురుపత్వంత్ సింగ్ పన్నులాంటి వారి ఖాతాలు కూడా ఇండియాలో బ్యాన్ అవ్వనున్నాయి. ఈ కొత్త పాలసీ కోసం సోషల్ మీడియా కంపెనీలతో పాటు అమెరికా ప్రభుత్వంతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.





# ఆగస్టు 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు

### నెలరోజులపాటు జరుగనున్న వర్షాకాల భేటీ

**న్యూఢిల్లీ, జులై 4 :** జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఆగస్టు 21 వరకు నెల రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల షెడ్యూల్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ఆగస్టు 15న స్వాతంత్య దిన వేడుకలు ఉన్నందున 13, 14 తేదీల్లో సమావేశాలు ఉండవని తెలిపారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రవాద దాడిపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఈ సమావేశాల్లోనే బీమా సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశముంది. బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 100 శాతానికి పెంచుతున్నట్లు తెలుస్తోంది. బిల్లు ముసాయిదా సిద్ధంగా ఉంది. పహల్గాం ఉగ్రదాడి, ఆ తరువాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్-పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కూడా ఈ సందర్భంగా చర్చించాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో వర్షాకాలపు సమావేశాలు వాడి వేడిగా జరిగే అవకాశముంది. గతలో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు రెండు భాగాలుగా జరిగాయి. మొదటి సమావేశం జనవరి 31న ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకూ కొనసాగింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాల రెండవ భాగం మార్చి 10న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగిసింది.

# మహారాష్ట్ర నుంచి భారీగా వరద

### కాళేశ్వరం వద్ద ప్రాణహిత ఉధృతి

**జయశంకర్ భూపాలపల్లి, జూలై 4 :** కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది మరోసారి ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో నదికి వచ్చే వరద నీటి ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక వ్యాపార స్థలాలు పూర్తిగా నీట మునిగాయి. ఇప్పటి వరకు నీటి కొరతతో వెలిసిన నదీ తీరంలో గుడారాలు వేసుకుని వ్యాపార కార్యకలాపాలు సాగించిన స్థానికులు, వరద ఉధృతికి అవన్నీ కోల్పోయారు. మరోవైపు, నీటి ఉధృతి ఉన్నా కూడా భక్తులు పుణ్యస్నానాల కోసం నదిలోకి దిగుతున్న దృశ్యాలు అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో భక్తులు నదిలోకి ప్రవేశించడం పట్ల అధికారులు అప్రమత్తమవుతున్నారు. వరద ప్రవాహం పెరగడంతో నది పక్కన ఎలాంటి శాశ్వత ఏర్పాట్లు లేకపోవడం వల్ల, ప్రజలకు అవగాహన కల్పించేం దుకు సిబ్బందిని మోహరించారు. ఇక ఎగువ మహారాష్ట్ర నుంచి వస్తున్న భారీ వరద నీరు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీకి చేరుతోంది. ప్రస్తుతానికి బ్యారేజీకి పై నుంచి సుమారు 84,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 85 గేట్లను ఎత్తి, అదే స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద ఇన్‌ఎ÷-లో, అవుట్‌ఎ÷-లో సమానంగా కొనసాగుతున్న నేపథ్యంలో, దిగువన ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ వరద ఉధృతికి సంబంధించి జిల్లా పాలన యంత్రాంగం ఇప్పటికే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. లోతట్టు ప్రాంతాలపై నిఘా పెట్టి, అవసరమైతే స్థానికులను ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరద స్థాయిలను గమనిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. భక్తులు కూడా నదిలోకి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.



# హైదరాబాద్‌లో మాజీ సీఎం రోశయ్య విగ్రహం

### లక్డీకాపూల్‌లో ఆవిష్కరించిన మల్లికార్జున ఖర్గే

**హైదరాబాద్, జూలై 4 :** నగరంలోని లక్డీకాపూల్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. రోశయ్య జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నేతలు నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. వైఎస్ మరణం తరవాత ఆయన సిఎంగా పనిచేశారు. తరవాత తమిళనాడు గవర్నర్‌గా వెళ్లారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రభుత్వం విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేతుల మీదుగా ఆవిష్కరించిన ఈ కార్యక్రమంలోసీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యకర్తలు కూడా భారీగా తరలివచ్చారు.


# టెకీపై అత్యాచారం

**పుణె:** మహారాష్ట్రలోని పుణెలో ఓ అపార్ట్‌మెంటు ఫ్లాటులోకి డెలివరీ ఏజెంటులా వచ్చిన యువకుడు అందులో ఉంటున్న ఐటీ ఉద్యోగురాలి (22)పై అత్యాచారం చేశాడు. నగరంలోని కొంధవా ప్రాంతంలో బుధవారం రాత్రి 7.30 సమయంలో ఈ దారుణం జరిగినట్లు డీసీపీ రాజ్‌కుమార్ శిందే తెలిపారు. సోదరుడు బయటకు వెళ్లడంతో ఆ సమయంలో ఆమె ఇంట్లో ఒంటరిగా ఉందన్నారు. బ్యాంకు డాక్యుమెంటు లాంటిది చూపిన నిందితుడు సంతకం చేయాలని ఆమెను కోరాడు. బాధితురాలు పెన్ను కోసం ఇంట్లోకి వెళ్లగానే వెనుకగా వచ్చి తలుపు గడియ వేసి అకృత్యానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత స్పృహ కోల్పోయిన బాధితురాలి ఫోనుతో నిందితుడు దిగిన సెల్ఫీలో పాక్షికంగా అతడు కనిపిస్తున్నాడు. ఆమె ఫొటోలు తీశానని, పోలీసులకు చెబితే వైరల్ చేస్తానని హెచ్చరిస్తూ "నేను మళ్లీ వస్తా" అని ఓ సందేశం పెట్టి వెళ్లాడు. గంట తర్వాత స్పృహలోకి వచ్చిన బాధితు రాలు బంధువులకు విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# మెటా అలర్ట్..

### సూసైడ్‌ను అడ్డుకున్న పోలీసులు

**లఖ్‌నవూ:** మన జీవితంలో భాగమైన కృత్రిమ మేధ.. తాజాగా ఓ యువకుడి ప్రాణాలు కాపాడింది. ఆత్మహత్యకు సిద్ధమైన ఓ వ్యక్తిని.. మెటా ఏఐ అలర్ట్‌తో పోలీసులు రక్షించగలిగారు. అదేలా సాధ్యమైందంటే..? ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్‌కు చెందిన 19 ఏళ్ల యువకుడు.. ప్రియురాలు తనను మోసం చేసిందని, అంతే కాకుండా తిరిగి బెదిరింపులకు పాల్పడుతోందని శుక్రవారం తెల్లవారుజామున ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టాడు. ఆ మోసాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నానని అందులో రాసుకొచ్చాడు. ఆత్మహత్యకు సంబంధించిన మెసేజ్‌ను గుర్తించిన మెటా ఏఐ.. వెంటనే ఉత్తరప్రదేశ్ పోలీసు ప్రధాన కార్యాలయాన్ని అలర్ట్ చేసింది. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు యువకుడి మొబైల్ నంబర్ ట్రాక్ చేసి.. కేవలం 15 నిమిషాల్లోనే అతడి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా గుర్తించి, కుటుంబసభ్యుల సహాయంతో పోలీసులు అతడిని రక్షించారు. ఆ యువతి మరో వ్యక్తిని వివాహం చేసుకోవడానికి సిద్ధమవుతుండడంతో యువకుడు ఈ నిర్ణయం తీసుకున్నాడని పోలీసులు పేర్కొన్నారు. యువకుడికి, అతడి కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపివేసినట్లు తెలిపారు. 2023 జులై 1 నుంచి ఇప్పటి వరకు మెటా హెచ్చరికల ఆధారంగా దాదాపు 1,107 మంది ప్రాణాలను కాపాడినట్లు యూపీ పోలీసులు పేర్కొన్నారు.



# ప్యాంట్ జేబులో పేలిన సెల్‌ఫోన్

### యువకుడికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్:** ప్యాంట్ జేబులో పెట్టుకున్న ఫోన్ పేలిన ఘటన రాజేంద్రనగర్ అత్తాపూర్‌లో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బాధితుడి తొడ భాగం కాలిపోయింది. పెయింటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ తన ప్యాంట్ జేబులో స్మార్ట్ ఫోన్ పెట్టుకున్న కొద్దిసేపటికే పేలింది. క్షతగాత్రుడిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



## అయ్యప్ప స్వామి నూతన ఆలయం నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేత

**బీబీనగర్, రాజముద్ర న్యూస్ :** బీబీ నగర్ మండలంలోని పడమటి సోమారం గ్రామంలో శ్రీ లింగ బసవేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ అయ్యప్ప స్వామి సన్నిదానం నూతన ఆలయ నిర్మాణం కొరకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బొక్క జైపాల్ రెడ్డి తన సొంత నిధులతో 100000/- లక్ష రూపాయలు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం బొక్క జైపాల్ రెడ్డి ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకిటి అంజిరెడ్డి గురుస్వామి, భువనగిరి మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆల్వా మోహన్ రెడ్డి, పడమటి సోమరం మాజీ సర్పంచ్ తలబోయిన జంగయ్య యాదవ్, బిఆర్ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కినగేష్, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, తలారి గణేష్, ఎర్రబోతు భాస్కర్, ఎస్ భాస్కర్ రెడ్డి, వాకిటి ఉపేందర్ రెడ్డి, ఆల్వా సురేందర్ రెడ్డి, జి బిక్షపతి, ఏ బలరాం, ఏ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

**అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి**

**ఆలేరు రాజముద్ర న్యూస్:** ఆలేరు న్యూ డెమోక్రసీ కార్యాలయంలోఅఖిల భారత రైతు కూలీ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొని మామిడాల బిక్షపతి మాట్లాడుతు తెలంగాణ సాయుధ రైతంగ పోరాట తొలి అమరవీరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో విసునూరు దేశముఖ్ కు వ్యతిరేకంగా కడివెండిలోలో జరుగుతున్న రైతాంగం ప్రదర్శనలో దొడ్డి కొమురయ్య ముందు వరుసలో ఉన్నాడని, విసునూరు ధరలు జరిపిన కాల్పులు తగిలి నేల కోరిగాడని, ఈ పోరాటంలో తొలి అమరవీరుడు అన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను రక్షణకై కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని ఈనెల 9న జరిగే దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను విజయవంతంచేయాలని అన్నారు. దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గం 50 కోట్లపైగా ఉన్నారని, వీళ్ల కి ఉన్నటువంటి హక్కులను మోడీ ప్రభుత్వం రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని అన్నారు. కార్మిక చట్టాల రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ. కనీస వేతనాల పెంపు. ఉద్యోగ భద్రత. ఉపాధి హక్కుల సాధనకై దేశ రక్షణకై సార్వత్రిక సమ్మె జరుగుతుందని అన్నారు. వ్యాపార లాభ పెక్షతో పని గంటలను పెంచుతున్నారని, 8గంటల పని దినాన్ని పరిరక్షించాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, స్కీం కార్మికులకు కనీస వేతనం 26000/- ఇవ్వాలని తదితర చట్టబద్ధ హక్కులు అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రైతులు, కూలీలు, ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కల్లెపు అడవయ్య, బేజాడి కుమార్, అధ్యక్షులు మామిడాల సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు చిరబోయిన రాజయ్య, జిల్లా నాయకులు బర్మా బాబు, పిన్నపు రాఘవరెడ్డి, ఇక్కిరి సహదేవ్, గుదే అక్షయ, చిరబోయిన కొమురయ్య, మాలోతు మోతిలాల్, వంగాల నరసింహారెడ్డి, అమరేందర్ రెడ్డి, గడ్డం మంకయ్య తదితరులు పాల్గొన్నారు.



## అమరజీవి దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో భూ పోరాటాలను కొనసాగిద్దాం

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా పిలుపు

**యాదాద్రి భువనగిరి రాజముద్ర న్యూస్:** భూమికోసం భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం వెట్టి చాకిరికి వ్యతిరేకంగా రైతులను కూలీలను పేదలను ఏకం చేసి దున్నేవారికి భూమి కావాలని సాయుధ పోరాటం నడిపి పోరాటంలో తొలి అమరుడు అమరజీవి కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి స్ఫూర్తితో మరో మారు భూ పోరాటాలను కొనసాగిద్దామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో అమరజీవి దొడ్డి కొమరయ్య 79 వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో "భూ సదస్సు " రాష్ట్ర కమిటీ సభ్యులు గంగదేవి సైదులు అధ్యక్షతన జరగగా సదస్సుకు ముందుగా దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం నర్సింహ పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్న నేటికీ అనేక మందికి ఉండడానికి ఇల్లు లేక దున్నుకొని జీవించడానికి భూమిలేక అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. నాడు తెలంగాణ సాయుధ పోరాటంలో వెట్టిచాకిరి వ్యతిరేకంగా దున్న వాడికి భూమి కావాలని పోరాటాలు నడిపి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచితే నాటి భూస్వాములే నేడు పెట్టుబడుదారులుగా మారి వందలాది ఎకరాలను పరిశ్రమల పేరుతో, సెజ్ ల పేరుతో, ఫామ్ హౌజ్ ల పేరుతో కాజేస్తున్నారని విమర్శించారు. పేదలు గత 70, 80 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ ఉంటే పాలకులు మాత్రమే వారికి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో రాచకొండ ప్రాంతంలో మిగతా ప్రాంతాలలో వందలాది ఎకరాలు పేదలు సాగు చేసుకున్నారని వివిధ కారణాల పేరుతో కెసిఆర్ ప్రభుత్వం వారందరికీ నూతన పాస్బుక్కులు ఆపి వారి హక్కులను కాలరాచారని అన్నారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆ భూములకు పట్టాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లాలో ఆరు మండలాలలో నాలుగు మున్సిపల్ పట్టణాల్లో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధాన్ని ఎత్తివేయాలని, చౌటుప్పల్ మండలంలోని మల్కాపురం, సింగరాయ చెరువు, తూప్రాన్ పేట, చిన్న కొండూరు, ధర్మోజి గూడెం, పీపులపాడు, నాగారం, లింగోటం, లక్కారం తోపాటు వివిధ గ్రామాలలో ఉన్న భూ సమస్యను వెంటనే పరిష్కరించి పట్టాదారు పాస్బుక్ ఇవ్వాలని లేకపోతే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని నర్సింహ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. పాషా, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బొజ్జ బాలయ్య, ప్రజానాట్యమండలి అధ్యక్షులు గోశిక కరుణాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బోయ యాదయ్య పాల్గొని మాట్లాడగా ఇంకా వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు యాట ముత్యాలు, యాట బాలరాజు, పొట్ట వెంకటయ్య, జంగం అంజయ్య తోపాటు సాగుదారులు పాల్గొన్నారు.





# జర్నలిస్టులు సమాజానికి ఎంతో కీలకం

**కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి**
- నూతన కార్యవర్గాన్ని సన్మానించిన తుంగతుర్తి రవి
- జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** నవ సమాజ నిర్మాణానికి జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఆవరణలో నూతన కార్యవర్గ సభ్యులను ముఖ్య అతిథులుగా హాజరై సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి లాంటి వారని, వారి సేవలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలకు మంచి వార్తలను అందించే విధంగా విలేకరులు పనిచేయాల ని తమ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు. ప్రజా సమస్యలను ప్రతిబింబించేలా వారి మన్ననలు పొందా లని అన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... మేడిపల్లి మండల పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వచ్చే విధంగా ప్రజా పాలన ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదా రులు వి. సూర్యనారాయణ రెడ్డి, మాజీ అధ్యక్షుడు కల్మారి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి వడ్డేమాను సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్ ఉపాధ్యక్షులు సైరెడ్డి సాగర్ రెడ్డి, చింత రమేష్, కో - ఆర్డినేటర్ రావు నాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శులు చిన్నం మధు, నీరుడు అంజన్ కుమార్, దయాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు బుషా గణేష్, భాస్కర చారీ, శేరి కరుణాకర్ రెడ్డి, మరాటి మత్స్యగిరి, జక్కు భగీరథరెడ్డి, జంగా నరేందర్ యాదవ్ పాల్గొన్నారు.

## దేవేందర్ నగర్ కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీ బీరప్ప దేవాలయం వద్ద బోడుప్పల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరుడై స్ఫూర్తినిచ్చిన వ్యక్తి దొడ్డి కొమురయ్య అని తెలిపారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తలచుకోగానే మొదటగా గుర్తు వచ్చేది పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని, తెలంగాణలో భూస్వామ్యపాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు జెన్నె దర్మయ్య కురుమ, ప్రధాన కార్యదర్శి మరాటి మల్లేష్ కురుమ, కోశాధికారి బండ బీరప్ప కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ మైల్ల నర్సింహ్మా కురుమ, కాంగ్రెస్ నాయకులు జెన్న రాజు కురుమ, మరాటి మత్స్యగిరి కురుమ, జోగు సుధాకర్ కురుమ, దయ్యాల మహేష్ కురుమ, జోగు మల్లేష్ కురుమ, కాటం స్వామి కురుమ, ఓరుగంటి భాస్కర్ కురుమ, వాసూరి చిన్న యాదగిరి కురుమ, సానిక యాదగిరి కురుమ, కేమిడి లక్ష్మయ్య కురుమ, బెల్లపూరి పరుష రాములు కురుమ, బండ సైజులు, జోగు బాస్కర్ కురుమ, మైల్ల మల్లేష్ కురుమ, మల్యాల సోమరాజు కురుమ, చెవ్వెల్లి సోమయ్య కురుమ, మరాటి వెంకటేష్ కురుమ, బండ సోమేష్ కురుమ, నకీర్త మధు, కర్రె బీరప్ప కురుమ, మంగ రమేష్ కురుమ, మంగ శ్రీశైలం కురుమ, జెట్ట రాము కురుమ, గుడుగుండ్ల అనిల్ కురుమ, తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ నియోజకవర్గంలో 10 కోట్లతో నూతన పోలీస్ స్టేషన్లు

- ప్రజల సౌకర్యార్థం అధునాతన పోలీస్ స్టేషన్లు
- డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకూడదని యువతకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్ హితవు పలికారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలో 10 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించే పోలీస్ స్టేషన్లకు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, డిఐజి తాఫ్సీర్ ఎగ్బాల్, ఎస్పీ నారాయణరెడ్డి, హౌసింగ్ ఐజిపి రమేష్ లతో కలిసి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్ కొడంగల్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శంకుస్థాపనలు గావించి, భూమి పూజ చేశారు. కొడంగల్ పోలీస్ స్టేషన్ 2.96 కోట్లు, సర్కిల్ పోలీస్ స్టేషన్ 84.50 లక్షలు, దుద్యాల పోలీస్ స్టేషన్ 3 కోట్లు, బొమ్మరాస్ పెట్ 2.96 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టే పనులకు డైరెక్టర్ ఆఫ్ జనరల్ పోలీస్ జనరల్ జితేందర్ శంకుస్థాపన గావించారు. అనంతరం డీజీ జితేందర్ మాట్లాడుతూ... ప్రజల సౌకర్యార్థం అధునాతన సౌకర్యాలతో పోలీస్



స్టేషన్ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. కొడంగల్ పరిధిలో 10 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టే పోలీస్ స్టేషన్లకు శంకుస్థాపన చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పోలీస్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని వస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదకద్రవ్యాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి మాదకద్రవ్యాల తరలింపు పై ప్రత్యేక నిఘాతో దోషులను గుర్తించడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. యువత చెడు వ్యసనాలకు గురి కావడం వల్ల కుటుంబాలు చెల్లాచెదురు అవుతున్నాయని, ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలను తెలుసుకొని తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. పోలీస్ స్టేషన్ల శంకుస్థాపన కార్యక్రమంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, పరిగి డిఎస్పి శ్రీనివాస్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ విజయకుమార్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కే.రోశయ్య జయంతి



**వికారాబాద్, రాజ ముద్ర న్యూస్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్ గా వ్యవహరించిన కొణిజేటి రోశయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించారు. రోశయ్య మాజీ ముఖ్య మంత్రి చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థ లు) సుధీర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో యువజన క్రీడల అధికారి మహమ్మద్ సత్తార్, విద్యా శాఖ అధికారి రేణుకదేవి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



## విద్యార్థిని సన్మానించిన డిసిఓ కే.వెంకటరావు




**చౌటుప్పల్, రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా,దేశముఖి పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల మలక్పేట్, కార్వాన్ బాయ్స్ క్యాంపస్ కు చెందిన పదో తరగతి విద్యార్థి జి రామకృష్ణారెడ్డి గత నెలలో నేపాల్ లోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్ శిఖరాన్ని అధిరోహించినట్లు ప్రిన్సిపాల్ డిసిఓ కే వెంకటరావు తెలిపారు. విద్యార్థి జి.రామకృష్ణారెడ్డి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ శిఖరం అధిరోహించి జాతీయ పతాకాన్ని ఎగరవేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపల్, హైదరాబాద్ డిసిఓ కే వెంకట్రావు పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో శాలువా కప్పి విద్యార్థిని అభినందించారు. విద్యార్థి జీ రామకృష్ణారెడ్డి భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీవీ హరి కుమార్, డిప్యూటీ వార్డెన్ అజార్,ఫిజికల్ డైరెక్టర్ పి హేమంత్ కుమార్, ఎం సతీష్,డి రాజ్ కుమార్, ఏ రవి శేఖర్,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించిన గుర్రం లక్ష్మారెడ్డి

**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ (23మంది) లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ కొరకు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుర్రం లక్ష్మారెడ్డి సౌజన్యంతో ఒక్కొక్క కుటుంబానికి ఐదువేల రూపాయలు చొప్పున మొత్తం ఒక లక్ష పదిహేను వేల రూపాయలును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నోముల మల్లేష్,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,సిరికొండ జహంగీర్, పంతంగి రాజు, కందుల శ్రీను,కొండం ఆశ్విన్ కుమార్, కమ్మంపాటి రమేష్, దయాకర్, నరేష్, సుంకరి కృష్ణ ,లింగస్వామి, జువ్వగాని కమలమ్మ, జయమ్మ, కమలమ్మ, లింగమ్మ, వెంకటమ్మ, లావణ్య, అలివేలు పాల్గొన్నారు

## ఉద్యమకారులు ఇంకా ఎంతమంది నేలకొరగాలి

**టియుజెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్**



**వలిగొండ రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసి జైలు జీవితాలను గడిపి కోర్టుల కేసులపాలై నష్టపోయిన ఉద్యమకారులు ఇంకా ఎంతమంది నేలకు ఒరగాలి అని టియు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ అనేకమంది ఉద్యమకారులు చనిపోయారని మరి కొంతమంది ఆర్థికంగా నష్టపోయి చితికిపోయారని వారు కూడా ఉంటారో ఉడుతారో తెలియని పరిస్థితిని ఉందని ఆయన అన్నారు.ఏదో ఒకచోట ప్రతిరోజు ఉద్యమకారులు చనిపోతూనే ఉన్నారని ఇంకా ఎప్పుడు ఉద్యమకారుల గురించి పట్టించుకుంటారో తెలియడంలేదని ఆయన అన్నారు. నకిరేకల్ నియోజకవర్గం నోముల గ్రామానికి చెందిన మాదాసు నాగరాజు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసులపాలై నల్లగొండ జిల్లా జైలులో 26 రోజులు జైలు జీవితం గడిపి ఆర్థికంగా నష్టపోయి చితికిపోయి నిన్నగాక మొన్న చనిపోయారని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు వెంటనే ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజా పాలనలో పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే జీవో జారీ చేయాలని ఉద్యమకారులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు.



# అర్చక వృత్తి వంశపారపర్యమే..!

## అర్చకులే ఫోటోగ్రాఫర్లు..

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం ప్రసిద్ధిగాంచినది. సుమారు 400 సంవత్సరాల క్రితం వెలసిన దేవాలయం ఇది. కాకతీయ కాలంలో ఈ దేవాలయం నిర్మించినట్లు తెలుస్తుంది. ఈ దేవాలయంలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామికి నిత్య పూజలు చేస్తున్న అర్చకుల వృత్తి వంశపారం పర్యమే కొనసాగుతుంది. రెండు మూడు కుటుంబాలకు సంబంధించిన వారు మాత్రమే అర్చకులుగా పూజలు చేయడం జరుగుతుంది. ఏళ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తూ స్థానచలనం లేకుండా ఉంటున్నారు. పదవీ విరమణ చేసిన కూడా ఈ ఆలయంలోనే విధులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఆలయంలోని గర్భగుడిలోకి ఫోటోగ్రఫీ నిషేధించబడింది. కానీ వీరభద్ర స్వామి దర్శనానికి వచ్చిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, గర్భగుడిలోకి వెళ్ళినప్పుడు అర్చకులే ఫోటోగ్రాఫర్లుగా ఉండటం చూసి భక్తులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



# మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించాలి

## వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పనులను ప్రారంభించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డ్ నెంబర్ 18 లో గల ఇందిరమ్మ, బుడగ జంగం కాలనీలో మంజూరైన 13 ఇండ్లకు సంబంధించి పనులను జిల్లా అదనపు కలెక్టర్ ఎం.సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి లతో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేసిన వారి వివరాలను మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహమ్మద్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన ప్రతి ఒక్కరూ ఇండ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యటనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కలెక్టర్ ను అడుగగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల మంజూరు అవుతుందని కలెక్టర్ తెలిపారు.

# వంగవీటి రంగా సేవలు మరువలేనివి

## టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** పేద ప్రజల కోసం మాజీ శాసనసభ్యులు స్వర్గీయ వంగవీటి రంగా చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. రంగా 78వ జయంతిని పురస్కరించుకుని కేపీహెచ్బీ కాలనీ బస్టాండ్ లో ఉన్న రంగా విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బండి రమేష్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రంగా విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ యోధుడు, దళితుల, గిరిజనుల, మైనారిటీల హక్కుల కోసం పోరాడిన ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగ అని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గాలి బాలాజీ, గంధం కరుణాకర్ నాయుడు, యువ నాయకుడు శివ చౌదరి, కాపు సంఘ ప్రెసిడెంట్ భరత్, రంగమోహన్, వెంకట నాగేశ్వరావు, పున్నారావు, రాజా, గంధం రాజు, కొల్లి సత్యనారాయణ, కిలారి బాబు, పి ఆర్ నాయుడు, నల్లినికాంత్, అట్లూరు దీపక్, పృథ్వి, గంధం సోదరులు, ఇతర పెద్దలు, రంగా అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మన్యం వీరుడు అల్లూరికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే మాధవరం



**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముమ్మిడివరం ఎమ్మెల్యే సుబ్బురాజు కెపిహెచ్బి రోడ్ నెంబర్ ఒకటి నందు అల్లూరి సీతారామరాజు స్పోర్ట్స్ గ్రౌండ్‌లో ఆయన విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వెన్నులో వణుకు పుట్టించిన మహా యోధుడు.. మన్యం ప్రజల ఆరాధ్య దైవం అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని నేటి యువతరం అందరికీ తెలిసేలా పెద్దలు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, సీనియర్ నాయకులు శ్యామలరాజు, కిరణ్ వర్మ ,భీమరాజు, ప్రభాకర్ గౌడ్ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

- మేడ్చల్ మండలంలోని కిష్టాపూర్ లోగల సాంఘిక హాస్టల్ ను సందర్శించిన కలెక్టర్



**మేడ్చల్, రాజముద్ర న్యూస్:** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తుపై ఉన్నత శిఖరాలను నిర్వహించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. శుక్రవారం మేడ్చెల్ మండలంలోని కిష్టాపూర్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ / జూనియర్ కాలేజీ (బాలికలు)ని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కృషి, పట్టుదల, క్రమశిక్షణతో బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత చదువులు ఏమి చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా ముందుకు వెళ్లాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు కోరిన మేరకు రెసిడెన్షియల్ స్కూల్ లో డ్రైనేజీ, సైన్స్ ల్యాబ్, అదనపు టాయిలెట్లు తప్పకుండా ఇస్తామని, విద్యార్థులు కష్టపడి బాగా చదువుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా



కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి విద్యార్థులకు హితవు పలికారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. స్కూల్లో వసతులు ఏలా ఉన్నాయని, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనశాలలో టేబుల్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని కలెక్టరు ప్రిన్సిపల్ కు సూచించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకొని, మెను చార్టును పరిశీలించారు. మెనులో ఏమి వండారని అడిగి, వంటలను పరిశీలించారు. స్కూలు కాలేజీ కలిపి మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని ఇంటర్ లో ఏఏ గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ లోని వంట సామాగ్రి నాణ్యతను పరిశీలించి ఎక్స్పైరీ డేట్ నమోదుకు రిజిష్టరు నిర్వహించాలని కలెక్టరు సూచించారు. రెండవ అంతస్తులో నిర్మాణంలో ఉన్న హాలును కలెక్టర్ పరిశీలించారు. స్కూల్ ప్రిన్సిపల్ లలిత, జోనల్ ఆఫీసర్ రజిత స్కూలులో ఉన్న మేజర్, మైనర్ రిపేర్లకు నిధులు కావాలని కలెక్టరు దృష్టికి తీసుకురాగా, కలెక్టరు పరిశీలించి కొత్త డ్రైనేజీ పైప్ లైన్, టాయిలెట్ల రిపేర్లు, దోమల నివారణకు మెష్, ఫ్లోరింగ్ వంటి పనులకు అయ్యే ఖర్చుల అంచానాల ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్...

# ముగ్గురితో యుద్ధం



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్-చైనా బంధంపై భారత ఆర్మీ కీలక వ్యాఖ్యలు చేసింది. దాయాదికి చెందిన 81 శాతం మిలిటరీ హార్డ్‌వేర్ డ్రాగన్‌కు చెందినదేనని వెల్లడించింది. అలాగే తన సైనిక సామర్థ్యాన్ని పరీక్షించుకోవడానికి పాక్‌ను చైనా ఒక ల్యాబ్‌లా ఉపయోగించుకుంటోందని పేర్కొంది. ఇటీవల పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ సమయంలో నెలకొన్న పరిణామాలపై డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ మాట్లాడారు. "సాంకేతికత, నిఘా ఆధారంగా చాలా డేటా సేకరించాం. దాని ద్వారా ఆపరేషన్‌కు ప్లానింగ్ చేశాం. మొత్తం 21 లక్ష్యాలను గుర్తించాం. వాటిలో తొమ్మిదింటిని టార్గెట్ చేయడం సరైందని భావించాం. చివరి నిమిషంలోనే ఆ నిర్ణయం తీసుకున్నాం. మన సరిహద్దుల్లో ఇద్దరు శత్రువులు . వాస్తవంగా చెప్పాలంటే ముగ్గురు ఉన్నారు. అందులో పాకిస్థాన్ మొదటిది. దానికి చైనా నుంచి అన్ని రకాల సహాయం అందుతోంది. పాక్‌కు చెందిన 81 శాతం మిలిటరీ హార్డ్‌వేర్ చైనా నుంచి అందినదే. తన మిలిటరీ సాంకేతికతను పరీక్షించుకోవడానికి పాక్‌ను ల్యాబ్‌లా ఉపయోగించుకుంటోం ది. తుర్కియే నుంచి కూడా దాయాదికి మద్దతు అందింది. ఆప రేషన్ సిందూర్ తర్వాత నాలుగురోజుల పాటు భారత్-పాక్ మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆ సమయంలో డీజీ ఎంఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) స్థాయి చర్చలు జరుగుతున్నప్పుడు.. భారత్ దాడికి అనుసరిస్తున్న పద్ధతులు, ఎత్తుగడల సమాచారం ఎప్పటికప్పుడు బీజింగ్ నుంచి ఇస్లామా బాద్‌కు చేరింది" అని సింగ్ వెల్లడించారు. కాగా.. స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ గణాంకాల ప్రకారం.. 2015 నుంచి 8.2 బిలియన్ల డాలర్ల విలువైన ఆయుధాలను పాక్‌కు చైనా విక్రయించింది. 2020 నుంచి 2024 మధ్య చైనా నాలుగో అతిపెద్ద ఆయుధ ఎగుమతిదారుగా నిలిచింది. అందులో 63 శాతం ఎగుమతు లు పాక్‌కే చేరాయి. ఇవన్నీ దాయాదిని డ్రాగన్‌కు అతిపెద్ద క్లైంట్‌గా మార్చాయి. 2025లో యూఎస్ డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఇచ్చిన నివేదిక ప్రకారం.. భారతదేశం చైనాను తన ప్రధాన శత్రువుగా భావిస్తోంది. అదే సమయంలో పాక్‌ను ఎదు ర్కోవాల్సిన ఒక భద్రతా సమస్యగా పరిగణిస్తోందని పేర్కొంది. ఇదిలా ఉంటే..ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దాంతో తీవ్ర ఆగ్రహానికి గురైన భారత్ ఆపరేషన్ సిందూర్‌తో పాక్, పీఓకేలోని తొమ్మిది ఉగ్రస్థావరాలను టార్గెట్ చేసి, ఉగ్ర మూకలను మట్టుపెట్టింది. అది జీర్ణించుకోలేని పాక్.. దాడులకు తెగబడింది. వాటికి భారత్ తగిన సమాధానం ఇవ్వడంతో.. కాల్పుల విరమణ కోసం పొరుగుదేశం కాళ్లబే రానికి వచ్చింది. చైనా నుంచి పాక్ సమీకరించిన హెచ్‌క్యూ-9, ఎల్‌వై-80 వ్యవస్థలు, వాటి రాడార్లు.. సిందూర్ సమ యంలో భారత్ ప్రయోగించిన ఒక్క క్షిపణినీ ఆపలేకపోయిన సంగతి తెలిసిందే.

# ఆ విషయాల్లో జోక్యం చేసుకోవద్దట : భారత్‌కు చైనా హెచ్చరిక



**చైనా :** టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా వారసుడి ఎంపికపై నిర్ణయం తీసుకునే హక్కు ఆయనకే ఉందని భారత్ ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై స్పందించిన చైనా.. టిబెట్ విషయాల్లో భారత్ జోక్యం చేసుకోవడం తగదని, ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినకుండా చూసుకోవాల ని పరోక్ష హెచ్చరికలు చేసింది. అంతకుముందు ఇదే అంశంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. దలైలామా వారసు డిని నిర్ణయించే అధికారం, అందులో జోక్యం చేసుకొనే హక్కు ఎవరికీ లేదన్నారు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనో లేదా ఆ సంస్థ పరిధిలోనో ఉందన్నారు. దీనిపై తాజాగా చైనా విదేశాంగ శాఖ స్పందిస్తూ.. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడానికి టిబెట్ అంశాన్ని వాడుకోవడం భారత్ ఆపివేయాలని ఆశిస్తున్నామని పేర్కొంది. దలైలామా వారసుడిని ఆమోదించే హక్కు తమకు వారసత్వంగా కొనసాగుతోందని తెలిపింది. మరోవైపు తన వారసత్వంపై లామా టెంజిన్ గ్యా ట్సో ఇటీవల స్పందిస్తూ.. తన మరణాంతరం ఇది కొనసా గుతుందని ప్రకటించారు. భవిష్యత్తు గురువును (పునర్జన్మ పొందిన బాలుడిని) గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే గుర్తిస్తుం దని, మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని పరోక్షంగా చైనాకు తేల్చిచెప్పారు. అయినా చైనా మాత్రం తన మొండి వాదనను కొనసాగిస్తూనే ఉంది.

# ఉక్రెయిన్‌పై నిషేధిత రసాయన ఆయుధాలతో రష్యా దాడి

**ఉక్రెయిన్ :** సుదీర్ఘకాలంగా రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతు న్నాయి. ఈక్రమంలో ఓ సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఉక్రెయిన్‌పై పట్టు సాధించేందుకు రష్యా ఆ దేశంపై నిషేధిత రసాయన ఆయుధాలను ప్రయోగించినట్లు తెలుస్తోంది. నెదర్లాండ్స్ ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ వెల్లడించిన ఈ విషయాలు ప్రస్తుతం ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. ఈ రసాయన ఆయుధాల వాడకానికి సంబంధించిన ఆధారాలను ది హేగ్, డచ్ నిఘా సంస్థలు సేకరించాయి. కీవ్ సైనికులను ఉక్కిరిబిక్కిరి చేసి చంపేం దుకు మాస్కో వీటిని ఉపయోగిస్తుందని డచ్ రక్షణ మంత్రి రూబెన్ బ్రెకెల్‌మాన్స్ రాయిటర్స్‌తో పేర్కొన్నారు. ఈనేపథ్యంలో మాస్కోపై కఠిన ఆంక్షలు విధించా లని రూబెన్ పిలుపునిచ్చారు. ఈ రసాయన ఆయుధాలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. మొదటి ప్రపంచయుద్ధంలో జర్మనీ మొదట ఉపయోగించిన క్లోరోపిక్రిన్‌ను రష్యా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. డచ్ మిలిటరీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధిపతి పీటర్ రీసింక్ మాట్లాడుతూ.. తమకొచ్చిన నిఘా సమాచారం ప్రకారం నిర్వ హించిన సొంత దర్యాప్తులో ఈ విషయాలు వెల్లడైనట్లు తెలిపారు. ఈ రసాయన ఆయుధాల కారణంగా ఉక్రెయిన్‌లో ముగ్గురు మరణించారని రూబెన్ ఆరోపిం చారు. 2,500 మంది వరకు గాయపడ్డారని ఆ దేశ ఆరోగ్యశాఖ అధికారుల నివేదికలో తేలిందన్నారు. రష్యా ఈ రసాయన ఆయుధాలను విపరీతంగా ఉపయోగించడం ఉక్రెయిన్‌తో పాటు ఇతర దేశాలకు హానికరమేనన్నారు. ఈ క్రమంలో ఆ దేశంపై మరింత ఒత్తిడి తెచ్చి, పలు ఆంక్షలు విధించాలన్నారు. ఇంటెలిజెన్స్ తాజా నివేదికను డచ్ పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపా రు. గతేడాది తొలిసారిగా అమెరికా ఇలాంటి ఆరోపణలే చేసింది. ఉక్రెయిన్‌పై పైచేయి సాధించేందుకు రష్యా ఈ క్లోరోపిక్రిన్‌ను ఉపయోగిస్తుందని పేర్కొంది. అయితే, అప్పుడు మాస్కో వీటిని ఖండించింది. తాజా నివేదికలపై రష్యా రక్షణ మంత్రిత్వశాఖ స్పందిస్తూ.. తాము ఇలాంటి ఆయుధాలు ఏమీ ఉపయోగించలే దని, ఉక్రెయినే ఇలాంటివి చేస్తుందని ఆరోపించింది.




# పరిమితులెక్కడ..?

- అంతా టౌన్ ప్లానింగ్ అధికారులే అంట..?
- నాక్ ఇంజనీర్లకు వాటా..?

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** నియోజక వర్గంలో అక్రమ నిర్మాణాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. అలాగే నిర్మాణాలను ప్రోత్సహించే అధికారులు కూడా పెరిగిపోతున్నారు. కూకట్ పల్లి నియోజక వర్గం బాలానగర్ డివిజన్ పరిధి రాజు కాలనీలో 180 గజాల స్థలంలో పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా ఎటువంటి అనుమతుల పత్రం పొందకుండా ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణానికి తెర లేపారు. ఆ నిర్మాణం వెనక టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన కొందరు అధికారులు, నాక్ ఇంజనీరింగ్ విభాగం వాళ్లు కూడా లంచాలు తీసుకొని నోరు మూసుకున్నట్లు సమాచారం. వారే దగ్గరుండి మరీ ఒక పద్ధతి ప్రకారం అంటూ... ఉన్న 180 గజాల స్థలంలో మూడు భాగాలుగా విభజించి కట్టుకోమని సలహాలు ఇచ్చి అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తూ వారి జేబులు నింపుకొని ప్రభుత్వ ఆదాయానికి మాత్రం భారీగా గండి కొడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వీలైనంత త్వరగా స్పందించి జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి అందుకు కారకులైన అధికారులపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



# హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష బీభత్సం

## 63 మంది మృతి

**హిమాచల్ ప్రదేశ్ :** భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో హిమాచల్‌ప్రదేశ్ కొన్ని రోజులుగా అల్లాడుతోంది. ఈ వరదల కారణంగా రాష్ట్రంలో ఇప్పటివరకు 63 మంది మరణించగా.. అనేకమంది గల్లంతయ్యారు. ఈనెల 7 వరకు రాష్ట్రం లోని అన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. వరదల కారణంగా ఇప్పటివరకు దాదాపు రూ.400 కోట్లు నష్టం వాటిల్లిందని రాష్ట్ర విపత్తు నిర్వహణశాఖ అధికారులు తెలిపారు. అయితే, వాస్తవంగా ఇదింకా ఎక్కువగా ఉండవచ్చన్నారు. వర్ష బీభత్సంతో 63 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. వారిలో ఎక్కువగా మండి జిల్లా నుంచి 17 మంది, కాంగ్రాలో 13 మంది, చంబాలో ఆరుగురు, సిమ్లాలో ఐదుగురు ఉన్నట్లు తెలిపారు. ఈ వరద బీభత్సం మండిలో ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడి తునాగ్, బాగ్సాయెద్‌లో పెద్దఎత్తున వర్షాలు కురుస్తున్నాయి. ఈ జిల్లా నుంచే దాదాపు 40 మంది ఆచూకీ గల్లంతయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా 100 మందికి పైగా గాయపడ్డారు. వరదల కారణంగా వందలాది ఇళ్లు ధ్వంసమయ్యాయని, 14 వంతెనలు కొట్టుకుపోయాయని అధికారులు పేర్కొన్నారు. ఇక, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వేల మంది ప్రజలు చీకట్లో మగ్గుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కొండచరియలు కూడా విరిగిపడుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వంతెనలు కూలిపోవడంతో పాటు పలుచోట్ల రోడ్లు ధ్వంసం అవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వరదల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



# గోడ కాదు ఇల్లేనట..

## అలా ఎలా కట్టారోనని నెటిజన్ల షాక్

**బిహార్ :** సన్నగా ఎత్తుగా ఉన్న గోడలాంటి నిర్మాణం ఒకటి నెట్టింట్లో వైరల్ అవుతోంది. అసలు ఈ గోడ ఇక్కడ ఎందుకు కట్టారో అనుకుంటూ ముందుకు వెళ్లి చూసిన వారికి ఆశ్చర్యం కలగమానదు. ముందునుంచి చూస్తే అదొక ఇల్లు. బిహార్‌లోని ఖగాడియా జిల్లాలో ఉన్న ఈ నివాసం గురించి ఓ స్థానిక మీడియా పెట్టిన పోస్టు చూసి, నెటిజన్లు అవాక్కవుతున్నారు. వెడల్పు తక్కువలో పలు అంతస్తుల్లో ఈ భవనాన్ని నిర్మించారు. అసలు ఇందులో మనుషులు ఎలా నివసిస్తారు..? అని ఓ నెటిజన్ కామెంట్ చేశారు. ఇది బిహార్.. ఇక్కడ ఏదైనా సాధ్యమే అని మరొకరు రాసుకొచ్చారు. చైనా గోడ లాంటిదేమైనా కట్టాలని అనుకుంటున్నారా..? అని ఇంకొకరు ప్రశ్నించారు. గతంలో బిహార్‌లో ఇలాంటి విచిత్రమే వెలుగుచూసింది. ముజఫర్‌పుర్‌లో ఆరు అడుగుల స్థలంలో ఓ వ్యక్తి ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించారు.

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# బంగ్లాదేశ్ పర్యటన కష్టమే..

## బీసీసీఐకి అనుమతివ్వని కేంద్రం

ఆగస్టులో బంగ్లాదేశ్‌తో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడేందుకు భారత్ పర్యటించాల్సి ఉంది. అయితే, బంగ్లాలో అనిశ్చిత రాజకీయ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో టీమ్ఇండియా అక్కడికి వెళ్లడం కష్టమేనని సమాచారం. ఈ విషయంలో బీసీసీఐకి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. ఆగస్టు 17 నుంచి వన్డే సిరీస్ జరగాలి. కానీ, అక్కడ స్థానిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండటంతో ఆటగాళ్ల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని కేంద్రం స్పష్టంచేసినట్లు కథనాలు వస్తున్నాయి. కేంద్రం నుంచి అనుమతి వస్తేనే జట్టును పంపిస్తామని ఇప్పటికే బీసీసీఐ వర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే.

### త్వరలోనే సంయుక్త ప్రకటన

మరోవైపు భారత్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు తామెప్పుడూ సిద్ధమేనని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) తెలిపింది. ఇప్పుడు కాకపోయినా మరోసారి అవకాశం కల్పించాలని కోరుతోంది. ఈ క్రమంలో భారత ప్రభుత్వం నుంచి అనుమతి లేని నేపథ్యంలో.. త్వరలోనే బీసీసీఐ, బీసీబీ సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. సిరీస్‌లను వాయిదా వేయడమా లేదా రద్దు చేయడమా? అనేది అప్పుడే నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. పాకిస్థాన్‌తో మ్యాచుల మాదిరిగా తటస్థ వేదికల్లో నిర్వహిస్తారా? అనేది కూడా ఓ ఆప్షన్‌గా ఉందనేది క్రికెట్ వర్గాల నుంచి వినిపిస్తోన్న మాట.

### అమ్మకాలను నిలిపేసిన బంగ్లా బోర్డు

టీమ్ఇండియాతో మ్యాచులంటే ఎంత క్రేజ్ ఉంటుందో అందరికీ తెలిసిందే. దీనిని ఆదాయంగా మార్చుకొనేందుకు ప్రతి దేశం ఎదురుచూస్తుంటుంది. షెడ్యూల్ ప్రకారం ఆగస్టులో భారత్‌తో మ్యాచుల నేపథ్యంలో సిరీస్ మీడియా హక్కుల అమ్మకంతో భారీగా ఆదాయం ఆర్జించాలని బీసీబీ భావించింది. జులై 7, జులై 10న బిడ్డింగ్ నిర్వహించాలని తొలుత ఏర్పాట్లు చేసింది. ఇప్పుడు టీమ్ఇండియా పర్యటన వాయిదా పడే అవకాశాలు ఉండటంతో మీడియా హక్కుల అమ్మకాలనూ నిలిపేస్తూ నిర్ణయం తీసుకుంది. జులై 2025 నుంచి జూన్ 2027 మధ్య రెండేళ్ల కాలానికి మొదట మీడియా హక్కులను అమ్మాలని ప్రణాళికలను సిద్ధం చేసింది. పాకిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ (జులై 17 నుంచి జులై 25 వరకు) నుంచే అమల్లోకి తీసుకురావాలని అనుకుంది. ఆ ప్రణాళికలన్నింటినీ పక్కన పెట్టేయడం గమనార్హం.

# పటిష్ట స్థితిలో భారత్

- ఇంగ్లాండ్ 407 ఆలౌట్
- స్మిత్, బ్రూక్ భారీ శతకాలు
- సిరాజ్‌కు ఆరు వికెట్లు



**బర్మింగ్‌హామ్:** బర్మింగ్‌హామ్ రెండో టెస్టులో భారత్ బలమైన స్థితిలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను 407 పరుగులకు ఆలౌట్ చేసి 180 పరుగుల ఆధిక్యాన్ని సొంతం చేసుకున్న శుభ్‌మన్ సేన.. మ్యాచ్‌పై పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని అందుకున్న భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో దూకుడుగా ఆడింది. యశస్వి జైస్వాల్, రాహుల్ పోటీపడి షాట్లు ఆడడంతో భారత్ 7.3 ఓవర్లలోనే 50 పరుగులు దాటింది. ఈ స్థితిలో యశస్వి (28బీ 22 బంతుల్లో 6ఐ4)ను టంగ్ ఎల్బీగా ఔట్ చేశాడు. మూడో రోజు, శుక్రవారం ఆట చివరికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 64/1తో నిలిచింది. రాహుల్ (28), కరుణ్ నాయర్ (7) క్రీజులో ఉన్నారు. భారత్ ప్రస్తుతం 244 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు జేమీ స్మిత్ (184 నాటౌట్), హ్యారీ బ్రూక్ (158) భారీ శతకాలతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 407 పరుగులు చేసింది. సిరాజ్ (6/70), ఆకాశ్‌దీప్ (4/88) ప్రత్యర్థిని కట్టడి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 587 పరుగులు చేసింది.

అయినా.. బజ్‌బాల్: మూడో రోజు ఆట ఆరంభమై 10 బంతులు పడ్డాయి. అలోపే ఇంగ్లాండ్ ఇద్దరు బ్యాటర్లను కోల్పోయింది. సిరాజ్ వరుస బంతుల్లో రూట్ (22), స్టోక్స్ (0)లను పెవిలియన్ చేర్చాడు. ఓవర్‌నైట్ స్కోరు 77/3తో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్ పరిస్థితి ఇది. 84 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. భారత్ జోరు చూస్తే విరామం లోపే ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను చుట్టేసి ఫాలోఆన్ ఆడిస్తుందా అనిపించింది. కానీ లంచ్ కోసం ఇంగ్లిష్ జట్టు ఆనందంగా వెళితే.. టీమ్ఇండియా నిరాశతో మైదానాన్ని వీడింది. ఇందుకు కారణం జేమి స్మిత్, హ్యారీ బ్రూక్! వందలోపే సగం జట్టు పెవిలియన్ చేరినా.. ఈ జంట ఏమాత్రం బెదరలేదు. బజ్‌బాల్ అస్త్రాన్ని బయటకు తీసి స్కోరు బోర్డు పరుగులు పెట్టించింది. ముఖ్యంగా వికెట్‌కీపర్ స్మిత్ టెస్టులో టీ20ని చూపించాడు. పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ వేసిన ఓ ఓవర్లో స్మిత్ చెలరేగిపోయాడు ఒక సిక్స్, 4 ఫోర్లు బాదేశాడు. బ్రూక్ (ఓవర్‌నైట్ 30) సైతం బ్యాట్ ఝుళిపించడంతో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ టీ20 తరహాలో సాగిపోయింది. 43 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసిన స్మిత్.. ఆ తర్వాతా దూకుడు కొనసాగించాడు. కాసేపట్లో లంచ్ అనగా జడేజా బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాది స్మిత్ 80 బంతుల్లోనే శతకాన్ని సాధించాడు. ఇంగ్లాండ్ 249/5తో లంచ్‌కు వెళ్లింది. ఈ ఒక్క సెషన్లోనే ఇంగ్లాండ్ 172 పరుగులు రాబట్టింది.

### పేసర్ల విజృంభణ:

లంచ్ తర్వాతా స్మిత్-బ్రూక్ జోరు కొనసాగింది. తొలి టెస్టులో ఒక్క పరుగు తేడాతో శతకం కోల్పోయిన బ్రూక్ ఈసారి ఆ మైలురాయిని అందుకున్నాడు. 137 బంతుల్లో టెస్టుల్లో తొమ్మిదో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మరోవైపు అదే జోరుతో ఆడిన స్మిత్ 144 బంతుల్లోనే 150 అందుకున్నాడు. ఇంగ్లాండ్ స్కోరు చూస్తుండగానే 350 దాటేసింది. టీ విరామానికి ఆ జట్టు 355/5తో నిలిచింది. విరామం తర్వాత బ్రూక్ కూడా 150 దాటాడు. భారత్ కొత్త బంతిని తీసుకోవడం మ్యాచ్ గమనాన్ని మార్చింది. భారీ స్కోర్లు చేసి పాతుకుపోయిన స్మిత్-బ్రూక్ జంట ఎట్టకేలకు విడిపోయింది. ఘనత మాత్రం ఆకాశ్‌దీప్‌దే. ఆకాశ్ వేసిన లెంగ్త్ బంతిని బ్రూక్స్ ఫార్వర్డ్ డిఫెన్స్ ఆడబోగా అది బ్యాట్, ప్యాడ్ మధ్య నుంచి దూరి స్టంప్స్‌ను గిరాటేసింది. దీంతో ఆరో వికెట్‌కు 303 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. అక్కడ నుంచి భారత బౌలర్లదే హవా. అటు సిరాజ్ ఇటు ఆకాశ్ విజృంభించడంతో ఇంగ్లాండ్ బ్యాటర్లు నిలవలేకపోయారు. ఆ జట్టు 4 ఓవర్ల తేడాతో 3 వికెట్లు కోల్పోయింది. వోక్స్ (5)ను ఆకాశ్ బుట్టలో వేయగా.. కార్స్ (0), టంగ్ (0)లను ఔట్ చేసిన సిరాజ్ అయిదు వికెట్ల ఘనత సాధించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు స్మిత్ ఒంటరి పోరాటం చేశాడు. పరుగుల అంతరాన్ని వీలైనంత తగ్గించే ప్రయత్నం చేశాడు. కానీ బషీర్ (0)ను ఔట్ చేసిన సిరాజ్ ఆరో వికెట్ ఖాతాలో వేసుకోవడంతో పాటు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. స్మిత్ అజేయంగా నిలిచాడు. ఆకాశ్‌దీప్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్ చివరి 4 వికెట్లను 20 పరుగుల తేడాతో కోల్పోయింది.



# ట్రేడ్ డీల్‌పై మదుపర్ల దృష్టి

## మార్కెట్లకు స్వల్ప లాభాలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని స్వల్ప లాభాలతో ముగించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ.. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ వార్తలపై దృష్టిపెట్టిన మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో నేటి ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటకు గురైన సూచీలు చివరకు స్వల్ప లాభాలను దక్కించుకున్నాయి. సెన్సెక్స్ దాదాపు 200 పాయింట్లు పెరగ్గా.. నిఫ్టీ 25,450 మార్క్ దాటింది. ఈ ఉదయం 83,306.81 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్.. కాసేపటికే ఒత్తిడికి గురైంది. ఒక దశలో 83,015.83 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయిన సూచీ చివర్లో కాస్త కోలుకుంది. మార్కెట్ ముగిసే సమయానికి 193.42 పాయింట్లు లాభపడి 83,432.89 వద్ద స్థిరపడి ంది. అటు నిఫ్టీ కూడా 25,331.65 – 25,470.25 మధ్య కదలాడింది. చివరకు 55.70 పాయింట్లు పెరిగి 25,461 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు బలపడి 85.38గా స్థిరపడింది. ఆటోమొబైల్, టెలికాం, లోహ రంగాలు మినహా మిగతా అన్ని రంగాల సూచీలు లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఫార్మా, చమురు, ఐటీ, రియల్టీ, మీడియా రంగ సూచీలు 0.4 నుంచి 1 శాతం మేర పెరిగాయి. నిఫ్టీలో బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, రెడ్డీస్ ల్యాబ్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యునిలివర్ షేర్లు రాణించగా.. ట్రెంట్, టాటా స్టీల్, ఐషర్ మోటార్స్, టెక్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు స్వల్పంగా పెరిగాయి.

# ఈ 5 బ్యాంకుల్లో మినిమమ్ బ్యాలెన్స్ అక్కర్లేదు

పొదుపు ఖాతాల్లో కనీస సగటు నిల్వ లేనిపక్షంలో బ్యాంకులు అపరాధ రుసుమును విధిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ఛార్జీల నుంచి కొన్ని బ్యాంకులు మినహాయింపు కల్పించి ఖాతాదారులకు ఊరటనిస్తున్నాయి. ఇటీవల పీఎన్‌బీ, బ్యాంకు ఆఫ్ బరోడా వంటి బ్యాంకులు దీనిపై ప్రకటన చేశాయి. మరి, ఇప్పటివరకు ఏయే బ్యాంకుల్లో మినిమమ్ బ్యాలెన్స్‌పై ఛార్జీలు ఎత్తివేశారో ఓసారి చూద్దాం.




### పంజాబ్ నేషనల్ బ్యాంక్..

తమ బ్యాంకులోని అన్ని సేవింగ్ ఖాతాల్లో కనీస సగటు నిల్వ (ఎంఏబీ)లు లేనిపక్షంలో విధించే పెనాల్టీలను ఎత్తివేస్తున్నట్లు పీఎన్‌బీ వెల్లడించింది. జులై 1 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. మహిళలు, రైతులు, అల్పాదాయ కుటుంబాలకు మద్దతుగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంకు ఎండీ, సీఈఓ అశోక్‌చంద్ర పేర్కొన్నారు.

### బ్యాంక్ ఆఫ్ బరోడా..

“ఎలాంటి ఆందోళనలు లేని బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నాం. ఇకపై కనీస బ్యాలెన్స్‌లపై ఎలాంటి అపరాధ రుసుములు ఉండవు. అన్ని సేవింగ్ ఖాతాలకు ఇది వర్తిస్తుంది” అని బ్యాంక్ ఆఫ్ బరోడా జులై 2వ తేదీన ‘ఎక్స్’ వేదికగా వెల్లడించింది.

### ఇండియన్ బ్యాంక్..

ఈ జాబితాలో చేరిన మరో బ్యాంకు ఇండియన్ బ్యాంక్. జులై 7వ తేదీ నుంచి అన్ని సేవింగ్ ఖాతాలపై మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీలను మినహాయిస్తున్నట్లు తాజాగా వెల్లడించింది.

### కెనరా బ్యాంక్..

కెనరా బ్యాంక్ ఈ ఏడాది మే నెలలోనే దీనిపై ప్రకటన చేసింది. అన్నిరకాల పొదుపు (సేవింగ్స్) బ్యాంకు ఖాతాలు, శాలరీ అకౌంట్లు, ఎన్నారైల ఎస్‌బీ అకౌంట్లు, మరికొన్ని ఇతర ఖాతాలకు కనీస నిల్వ (మినిమమ్ బ్యాలెన్స్) ఛార్జీలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ నిర్ణయం కూడా జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. విద్యార్థులు, శాలరీ ఖాతాలు ఉన్న ఉద్యోగులు, ఎన్నారైలు, సీనియర్ సిటిజన్లు, ఇతర వ్యక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా లావాదేవీలు నిర్వహించుకోవచ్చని కెనరా బ్యాంకు పేర్కొంది.

### స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా..

ప్రభుత్వరంగ అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చాలా ఏళ్ల నుంచే కనీస నిల్వలపై ఈ ఛార్జీల నుంచి ఖాతాదారులకు ఊరట కల్పిస్తోంది. 2020లోనే ఈ అపరాధ రుసుమును ఎస్‌బీఐ ఎత్తివేసింది. అప్పటినుంచి ఈ బ్యాంకులోని అన్ని సేవింగ్స్ ఖాతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ లేకపోయినా ఎలాంటి ఛార్జీలు పడట్లేదు.




# స్టాక్ మార్కెట్లోకి చిల్లర విసిరి..

## రూ.43 వేల కోట్లు వెనకేసుకొంది..

**దేశీయ స్టాక్ మార్కెట్లో ఉన్న చిన్నపాటి లొసుగులను ఆధారంగా చేసుకొని అమెరికా ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్ భారత మార్కెట్లో భారీ మొత్తాన్ని వెనకేసుకొంది. ఈవిషయం బయటపడటంతో సెబీ స్పందించి ఆ సంస్థ సంపాదించిన లాభం మొత్తాన్ని ఎస్క్రో అకౌంట్స్‌లో జమ చేయాలని ఆదేశించింది. కానీ, భారత మార్కెట్లోని బలహీనతను జేన్ స్ట్రీట్ ఉదంతం మరోసారి బయటపెట్టింది.**

సాధారణంగా క్యాష్ మార్కెట్లలో షేర్ల ధర స్వల్ప పెరుగుదల.. ఆప్షన్స్ మార్కెట్స్‌పై ఎక్కువ ప్రభావం ఉంటుంది. ఈ విషయాన్ని గ్రహించిన జేన్ స్ట్రీట్ కొన్నిరకాల వ్యూహాలను సిద్ధం చేసుకొని భారత మార్కెట్లో ట్రేడింగ్ చేసింది. 2023 జనవరి నుంచి 2025 మార్చి 31 వరకు రూ.43,289 కోట్ల లాభం సంపాదించింది. వీటిల్లో లోపాలను వాడుకొని కేవలం 21 రోజుల్లో సంపాదించిన మొత్తం రూ.4,843 కోట్లుగా సెబీ ఇప్పటివరకు తేల్చింది. తాజాగా సెబీ 2024 జనవరి 17వ తేదీ సహా మరో 14 బ్యాంక్ నిఫ్టీ ఎక్స్‌పైరీ డేట్లలో జేన్ స్ట్రీట్ అనుసరించిన విధానాలను విశ్లేషించింది. స్టాక్ మార్కెట్లో వివిధ రంగాల సూచీలను క్యాష్, ఫ్యూచర్స్, ఆప్షన్స్ మార్కెట్లో ట్రేడింగ్ చేస్తారు. ప్రతి రంగంలో బలమైన కంపెనీల షేర్లను సమ్మిళితం చేసి.. ఆ సెక్టార్ సూచీని రూపొందిస్తారు. వీటిల్లోని షేర్లు మారుతూ ఉంటాయి. ఇక ఆ కంపెనీల క్యాష్, ఫ్యూచర్స్ మార్కెట్లలో ఆ షేర్లు పెరగడం, తగ్గడం జరిగినప్పుడు.. అవి సూచీల ఆప్షన్ల విలువల్లో భారీగా మార్పులు తీసుకొస్తాయి. దీంతో ఒక కంపెనీ షేర్లను పెంచడం, తగ్గించడం చేసి.. దాని ఆధారంగా ఆప్షన్స్ సూచీల ట్రేడింగ్ చేశారు. ఈ రకంగా ట్రేడింగ్‌లు చేసేందుకు దేశంలో జేన్ స్ట్రీట్ ఆసియా ట్రేడింగ్ లిమిటెడ్, జేన్ స్ట్రీట్ ఇండియా ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్, జేన్ స్ట్రీట్ ఆసియా ఎల్‌ఎల్‌సీ అనే సంస్థలను రిజిస్టర్ చేసి వాడుకొంది. ఒక సంస్థ క్యాష్, ఫ్యూచర్ మార్కెట్లలో ఆర్డర్లు పెట్టడం, లావాదేవీలు చేయడం చేస్తుంటే.. అదే సమయంలో మరో సంస్థ ఆప్షన్స్ మార్కెట్లో దానికి అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించేదని గుర్తించారు.

### తొలి వ్యూహం ఇలా..

- బ్యాంక్ నిఫ్టీని ఎక్స్‌పైరీ రోజు ఉదయాన్నే తొలుత ఆ సూచీలో ఉన్న కీలక సంస్థల స్టాక్స్, ఫ్యూచర్స్‌లో భారీఎత్తున కొనుగోలు చేస్తుంది.
- అదే రోజు ఉదయం బ్యాంక్ నిఫ్టీ సూచీని ఆప్షన్స్ మార్కెట్లో సెల్ చేస్తుంది.
- ఆ రోజు మధ్యాహ్నం బ్యాంక్ నిఫ్టీలోని కంపెనీల స్టాక్, ఫ్యూచర్స్‌ను దూకుడుగా విక్రయిస్తుంది.
- క్యాష్ మార్కెట్లో ఆ కంపెనీల షేర్ల అమ్మకాలతో ఆప్షన్స్‌లో బ్యాంక్ నిఫ్టీ షార్ట్ పొజిషన్ల విలువ భారీగా పెరుగుతుంది. తేలిగ్గా ఆ పొజిషన్ల నుంచి లాభాల్లో బయటకు వచ్చేస్తుంది.

### రెండో వ్యూహం..

- మార్కెట్ చివరి రెండు గంటల్లో స్టాక్స్, ఫ్యూచర్స్, బ్యాంక్ నిఫ్టీ ఫ్యూచర్లను భారీగా విక్రయిస్తుంది.
- చివర్లో బ్యాంక్ నిఫ్టీ ఆప్షన్స్‌లో షార్ట్ పొజిషన్లలో ఉంటుంది. దీంతో మంచి లాభాల్లో సాఫ్ట్ క్లోజ్ చేస్తుంది.

### మూడో వ్యూహం..

- చివరి రెండు గంటల్లో నిఫ్టీ సూచీలో కీలకమైన షేర్లే పెద్దమొత్తంలో కొనుగోలు చేస్తుంది.
- అదే సమయంలో నిఫ్టీ సూచీ ఆప్షన్స్‌లో లాంగ్ పొజిషన్ తీసుకొంటుంది. నిఫ్టీలోని షేర్ల విలువ పెరగడంతో.. సూచీ ఆప్షన్స్ భారీగా పెరిగి లాభాలు వస్తాయి.

### జేన్ స్ట్రీట్ ఎంత సంపాదించింది..

సెబీ లెక్కల ప్రకారం జేన్ స్ట్రీట్ కేవలం 21 రోజుల్లోనే రూ.4,843 కోట్లు లాభం సంపాదించింది. ఇక జనవరి 2023 నుంచి మార్చి 2025 మధ్యలో దాదాపు రూ.43,289 కోట్లు ఆప్షన్స్‌లో సంపాదించింది. అయితే ఆప్షన్స్‌లో రూ.7,208 కోట్లు, ఫ్యూచర్స్‌లో రూ.191 కోట్లు, ఇండెక్స్ ఫ్యూచర్స్‌లో రూ.288 కోట్లు క్యాష్ మార్కెట్లో పోగొట్టుకొంది.

# ఉద్యోగానికీ కావాలి క్రెడిట్ స్కోరు


ఆర్థిక రంగంలోని సంస్థల్లో ఉద్యోగం చేయాలనుకుంటున్నారా? విద్యార్హతలు, నైపుణ్యాలు ఉంటేనే సరిపోదు. ఆర్థిక క్రమశిక్షణా త్యంత ముఖ్యం. ఇటీవలి సంఘటనే ఇందుకు ఉదాహరణ.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పేలవమైన క్రెడిట్ స్కోరు కారణంగా ఒక సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ (సీబీఓ) నియామకాన్ని రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు సమర్థించింది. ఆర్థిక సేవల రంగంలో ఉద్యోగులకు ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరమని పేర్కొంది. ఈ తీర్పు నేపథ్యంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే వారికి క్రెడిట్ స్కోరు ఎంత ముఖ్యమో తెలుస్తోంది. క్రెడిట్ స్కోరు మీ ఆర్థిక బాధ్యతను సూచించే మూడు అంకెల సంఖ్య. ఇది 300-900 వరకూ ఉంటుంది. మీ రుణ చెల్లింపుల చరిత్ర, రుణ వినియోగం, క్రెడిట్ చరిత్ర ఆధారంగా ఈ స్కోరును క్రెడిట్ బ్యూరోలు నిర్ణయిస్తాయి. 750కి మించి స్కోరున్నప్పుడే ఆ వ్యక్తికి ఆర్థిక క్రమశిక్షణ ఉన్నట్లు భావిస్తారు. ఆర్థిక సంస్థల్లో ప్రజల డబ్బును నిర్వహించే వారికి ఆర్థిక విషయాల్లో మంచి పరిజ్ఞానం ఉండాలి. స్వీయ క్రమశిక్షణా అవసరం. కాబట్టి, ఈ రంగంలోని బ్యాంకులు, బీమా తదితర సంస్థల్లో చేరాలంటే తక్కువ క్రెడిట్ స్కోరు లేకుండా చూసుకోవాలి. లేకపోతే మీ భవిష్యత్తుకు ఇది అడ్డంకిగా మారుతుంది.

### ఏం చేయాలి?

- ఉద్యోగ దరఖాస్తు చేసేందుకు కనీసం 6 నెలల ముందు నుంచి మీ క్రెడిట్ స్కోరును క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలి. తక్కువగా ఉంటే, దాన్ని పెంచుకునేందుకు ప్రయత్నం చేయాలి. క్రెడిట్ వినియోగ నిష్పత్తి తగ్గించుకోవడం, ఏదైనా చెల్లింపులు ఉంటే తీర్చేయడంలాంటివి చేయాలి.
- క్రెడిట్ చరిత్ర లేని వారు హామీతో కూడిన రుణాలు తీసుకొని, వాటిని సకాలంలో తీర్చేయాలి. దీనివల్ల క్రెడిట్ స్కోరును నిర్మించుకోవచ్చు.
- రుణ వాయిదాలు, క్రెడిట్ కార్డు బిల్లును సకాలంలో చెల్లించండి. ఒక్క నెల వాయిదా, కార్డు బిల్లు చెల్లించకపోయినా, స్కోరుపై ప్రతికూల ప్రభావం పడుతుంది.
- మీ క్రెడిట్ కార్డు పరిమితలో 30 శాతానికి మించి వాడొద్దు. అనవసర రుణాల కోసం దరఖాస్తు చేయొద్దు. వీలైతే అధిక వడ్డీ రుణాలను తీర్చేయడం మంచిది.

# ప్చ్.. సారీ 'తమ్ముడు'




జై (నితిన్) విలువిద్యలో దేశం తరఫున ఆడి ఎన్నో పతకాలు సాధిస్తాడు. మరొక పెద్ద లక్ష్యంపై గురి పెట్టినా, ఏకాగ్రత కుదరదు. మనసుని ఏవో జ్ఞాపకాలు వెంటాడుతూ ఉంటాయి. అక్క స్నేహలత (లయ)తో ముడిపడిన జ్ఞాపకాలే అవి అని కొన్నాళ్ల తర్వాత తెలుస్తుంది. జై చిన్నప్పుడు జరిగిన కొన్ని సంఘటనలతో కుటుంబానికి దూరమవుతుంది స్నేహలత. ఇంకెప్పుడూ పుట్టింటి గడప తొక్కనని శపథం చేసి వెళ్లిపోతుంది. ఆ మాట ప్రకారమే తండ్రి చనిపోయినా, ఇంటి వైపు తిరిగి చూడదు. అక్క విషయంలో చేసిన ఓ చిన్న తప్పు జైని వెంటాడుతూ ఉంటుంది. ఆ తప్పు గురించి చెప్పి, మళ్లీ అక్కకు దగ్గరవ్వాలని తన స్నేహితురాలు చిత్ర (వర్ష బొల్లమ్మ)తో కలిసి బయల్దేరతాడు. తీరా అక్కడకు వెళ్లాక ఆమె తన కుటుంబంతో కలిసి అంబర గొడుగు అటవీ ప్రాంతంలో జరిగే అమ్మవారి జాతరకు వెళ్లినట్టు తెలుస్తుంది. అలాగే ఆమె తన పేరును ఝాన్సీగా మార్చుకున్నట్టు తెలుసుకుంటాడు. దీంతో తన సోదరిని కలిసేందుకు జై కూడా అటవీ ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధమవుతాడు. మరోవైపు ఝాన్సీ, ఆమె కుటుంబాన్ని అజర్వాల్ (సౌరభ్ సచ్‌దేవా) ముఠా లక్ష్యంగా చేసుకుంటుంది. మరి జై తన అక్క ఝాన్సీని కలుసుకున్నాడా? అజర్వాల్ ముఠా నుంచి ఝాన్సీ, ఆమె కుటుంబం ఎలా బయట పడింది? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే!

రివ్యూ

**ఎలా ఉందంటే...**

అక్కా తమ్ముడి కథతో ముడిపడిన ఓ యాక్షన్ అడ్వెంచర్ సినిమా ఇది. అయితే ఆ బంధం చుట్టూ అల్లుకున్న భావోద్వే గాలు.. అడవిలో హీరో చేసే సాహసాలు రెండూ మెప్పిం చలేదు. భోపాల్, వైజాగ్ తదితర ప్రదేశాల్లో గతంలో జరిగిన గ్యాస్ లీక్ సంఘటనల్ని గుర్తు చేస్తూ ఆసక్తికరంగానే దర్శకు డు సినిమాని మొదలుపెట్టాడు. ముఖ్యంగా విలన్ పరిచయ సన్నివేశాలు సినిమాలో మరింతగా లీనం చేస్తాయి. ఆ తర్వా త అక్కాతమ్ముళ్ల ఒకరికొకరు దూరమైన తీరు, కుటుంబ నేపథ్యంలోని ఆ సన్నివేశాలు భావోద్వేగాలపై అంచనాల్ని పెంచుతాయి. హీరో అడవి బాట పట్టేవరకూ సినిమా ట్రాక్ లోనే వెళ్తుంది. ఆ తర్వాత నుంచే గాడి తప్పింది.

అడవిలో పాత్రలు చేసే ఆర్తనాదాలు తప్ప, మరే ఇతర భావో ద్వేగం ప్రేక్షకుడి హృదయాన్ని తాకవు. తొలి అరగంట తర్వా త సినిమా పూర్తిగా యాక్షన్ అడ్వెంచర్‌గా మలుపు తీసుకుం టుంది. ఝాన్సీకి, ఆమె కుటుంబానికీ రక్షణగా ఉంటూ, వాళ్లని అంబర గొడుగుని దాటించే బాధ్యత హీరోది. 'ఖైదీ' సినిమాని గుర్తుచేసే సందర్భం అది. అలాంటప్పుడు యాక్షన్ డిజైన్ థ్రిల్లింగ్‌గా ఉండాలి. హీరో చేసే సాహసాలు కట్టిపడే యాలి. కానీ, ఈ సినిమాలో అలాంటిదేమీ జరగదు. విజువ ల్స్‌తోనూ, సౌండ్‌తోనూ కట్టిపడేయాలనే ప్రయత్నం తప్ప, ఇతర యాక్షన్ సన్నివేశాలు, భావోద్వేగాలపై దృష్టిపెట్టలేదు.

ద్వితీయార్ధంలోనూ కథ, సన్నివేశాలేమీ మారవు. ఈసారి మరింత ప్రమాదకరంగా కనిపించే బౌంటీ హంటర్స్‌ని రంగంలోకి దింపుతాడు విలన్. దాంతో నాలుగైదు గ్యాంగ్‌లు హీరో వెంటపడుతుంటాయి. చుట్టూ నిప్పుని రాజేసి, మధ్యలో హీరో ఉంటూ చేసే ఓ పోరాట ఘట్టం మినహా ఇతర యాక్షన్ సన్నివేశాలేవీ ప్రభావం చూపించవు. ప్రీ క్లైమాక్స్ మగధీర సినిమాలో వంద మంది యోధులతో సాగే పోరాటాన్ని గుర్తు చేస్తుంది. ఇలాంటి సినిమాల్లో సన్నివేశాలు ఆద్యంతం థ్రిల్‌ని పంచుతూ, పరుగులు పెట్టాలి. ఆ సీరియస్‌నెస్ కోసమని పాటలు, రొమాంటిక్ సన్నివేశాల జోలికి కూడా వెళ్లరు. ఈ సినిమా విషయంలోనూ అలాంటి జాగ్రత్తలే తీసుకున్నాడు దర్శకుడు శ్రీరామ్ వేణు. కానీ ఆ అడవిలో హెల్ప్ డెస్క్‌ని చూపిస్తూ, హీరోయిన్ సప్తమి గౌడ చుట్టూ మలిచిన సన్నివేశాలు కథా గమనాన్ని దెబ్బతీశాయి. కథానాయకుడి పాత్రని మరింత బలహీనంగా మార్చేశాయి. సినిమాలో ఆకట్టుకునే విషయం ఏదైనా ఉందంటే.. ప్రతినాయకుడి పాత్రని డిజైన్ చేసిన విధానమే. సౌండ్ డిజైన్, విజువల్స్ కూడా ఓ మోస్తరు ప్రభావం చూపిస్తాయి.


**ఎవరెలా చేశారంటే..**

జై అనే ఆర్చరీ క్రీడాకారుడిగా కనిపిస్తాడు నితిన్. ఆయన కెరీర్‌కి పెద్దగా ఉపయోగపడని సినిమా ఇది. యాక్షన్ ఘట్టాలు మినహా ఆయన ప్రత్యేకంగా చేయడానికంటూ ఇందులో ఏమీ లేదు. లుక్ కూడా మారలేదు. లయ ప్రాధాన్యమున్న పాత్రలోనే కనిపిస్తారు కానీ, అది సినిమాపై పెద్దగా ప్రభావం చూపించదు. ప్రతినాయకుడిగా నటించిన సౌరభ్ సచ్‌దేవా మెప్పిస్తాడు. వర్ష బొల్లమ్మ, శ్వాసిక విజయ న్ పోరాట ఘట్టాలతోనూ ఆకట్టుకుంటారు. సప్తమిగౌడ చిన్న పాత్రలోనే కనిపిస్తారు. సాంకేతిక విభాగాల్లో సంగీతం, ఛాయాగ్రహణం పనితీరు మెప్పిస్తుంది. నిర్మాణం ఉన్నతంగా ఉంది. దర్శకుడు శ్రీరామ్ వేణు రచనలోనే బలం లేదు.

## గ్రామీణ నేపథ్యంలో సాగే.. ఉప్పు కప్పురంబు




ఒకవైపు సినిమాలు చేస్తునే మరోవైపు ఓటీటీలకు ఒకే చెబుతుంది నటి కీర్తి సురేష్. ఇప్పటికే అక్క అనే వెబ్ సిరీస్ చేస్తున్న ఈ అమ్మడు మరోవైపు ఉప్పు కప్పురంబు అంటూ ఒక ఓటీటీ సినిమా చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో ఈ చిత్రం నేరుగా ఈరోజు ప్రేక్షకుల ముందుకు రాగా ఈ చిత్రానికి ఐవీ శశి దర్శకత్వం వహించాడు. నటుడు సుహాస్ కీలక పాత్రలో నటించాడు. సినిమా కథ మొత్తం చిట్టి జయపురం అనే ఊరి చుట్టూ తిరుగుతుంది. తన తండ్రి మరణంతో చిట్టి జయపురం ఊరి పెద్దగా బాధ్యతలు తీసుకుంటుంది అపూర్వ (కీర్తి సురేశ్). అయితే అపూర్వకి ఇది సంతోషం ఇచ్చేలోపే ఊరికి విచిత్రమైన సమస్య వస్తుంది. ఊరిలో శ్మశానం కొరత ఎదురవుతుంది. ఆ ఊరిలో మొదటగా చనిపోయిన నలుగురికి మాత్రమే శ్మశానంలో చోటు ఉంటుంది. దీంతో ఈ విషయాన్ని ఊరి పెద్ద అయి న అపూర్వ ముందుకు తీసుకువెళతాడు కాటికాపరి చిన్న (సుహస్). ఈ విషయం తెలిసిన అపూర్వ ఊరి కోసం ఏం చేసింది. అపూర్వకి కాటికాపరి చిన్న ఎలా సహాయపడ్డాడు. శ్మశానం సమస్య ల్లో ఎలాం టి చిచ్చు పెట్టిందనేది ఈ సినిమా కథ. యువ దర్శకులు ఈ మధ్య కొత్త కొత్త కథలతో ప్రేక్షకుల ముం దుకు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఇలాంటి మరో కొత్త కథనే ఈ చిత్రం. చనిపోయిన తర్వాత శ్మశానం కొరత అనే సామాజిక సమస్యను వినోదంతో మేళవించి తెరకెక్కించే ప్రయత్నంలో దర్శకుడు ఐవీ శశి కొంతవరకు సఫలమయ్యారు. కీర్తి విషయానికి వస్తే.. ఇప్పటివరకు గ్లామర్, డీ-గ్లామర్ పాత్రలతో ఆకట్టుకున్న ఈ భామ చాలా రోజుల తర్వాత ప్రత్యేకమైన పాత్రలో నటించింది. అపూర్వ అనే గ్రామ పెద్దగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమెకు శ్మశానం సమస్య ఎదురవ్వడం. ఈ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించామని అనుకునేలోపు నలుగురు చనిపోవడంతో అది మరింత తీవ్రమవ్వడం ఆసక్తికరంగా సాగుతుంది. అలాగే ఈ సినిమాలో దర్శకుడు శ్మశానం చుట్టూ ఉన్న సమస్య లు, వాటి పరిష్కారాలను చూపించారు. కీర్తి సురేష్ గ్రామ పెద్దగా బాగా నటించినప్పటికీ, ఆమె పాత్రలో కొన్ని తికమక పెట్టే సన్నివేశాలున్నాయి. ఒక సీన్‌లో అమాయకంగా కనిపించిన కీర్తి, మరో సీన్‌లో చాలా తెలివైన అమ్మాయిగా వ్యవహరించడం లాజికల్‌గా అనిపించదు. కొన్ని సీన్లలో ఆమె అతిగా స్పందించినట్లు కూడా అనిపిస్తుంది. అయితే కీర్తి నటన మాత్రం చాలా బాగుంది. సుహాస్ పాత్ర చాలా స్థిరంగా, ఎక్కడా తడబాటు లేకుండా ఉంటుంది. సినిమా మొత్తం ఎక్కువగా సుహాస్, కీర్తిల మధ్యే సాగుతుంది. కథలో అక్కడక్కడా చిన్న లోటుపాట్లు ఉన్నప్పటికీ, ఈ సినిమా ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది.



### అనుష్క ఘాటీ మూవీ
## విడుదలకు సమస్యలు

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఘాటీ' విడుదల మరోసారి వాయిదా పడే సూచనలు మళ్లీ కనిపిస్తున్నాయి. గతంలో 'వేదం' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. యూవీ క్రియేషన్స్ సమర్పణలో, రాజీవ్ రెడ్డి, సాయిబాబా నిర్మిస్తున్న ఈ చిత్రం నుండి విడుదలైన గ్లింప్స్ ఇప్పటికే ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అయితే ఈ చిత్రాన్ని మొదట ఏప్రిల్ 18న విడుదల చేయడానికి సన్నాహాలు చేశారు. కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో విడుదల వాయిదా పడింది. ఆ తర్వాత, మేకర్స్ అధికారికంగా జులై 11న సినిమాను విడుదల చేస్తామని ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే షూటింగ్ కూడా పూర్తి చేశారు. అయితే, తాజా సమాచారం ప్రకారం, సినిమాకు సంబంధించిన సీజీ (కంప్యూటర్ గ్రాఫిక్స్) పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, విడుదల తేదీ లోపు అవి పూర్తయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. దీంతో, 'ఘాటీ' విడుదల మరోసారి వాయిదా పడే అవకాశం ఉందని.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుందని యూనిట్ వర్గాలు వెల్లడించాయి. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కొత్త విడుదల తేదీగా ఆగస్టు 27ను నిర్మాతలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అనుష్క అభిమానులు 'ఘాటీ' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, సినిమా విడుదల ఎప్పుడు జరుగుతుందో వేచి చూడాలి.

## హరిహర వీరమల్లు ట్రైలర్ అదుర్స్
### 24 గంటల్లో 48 మిలియన్ల వ్యూస్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ మూవీ జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. ఈ మూవీ ట్రైలర్ విడుదల కాగా, ప్రేక్షకుల నుంచి అపూర్వ స్పందన లభించింది. కేవలం 24 గంటల్లోనే తెలుగు ట్రైలర్‌కు 48 మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇది ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచింది. అంతేకాదు, అన్ని భాషల్లో కలిపి ట్రైలర్‌కు 61.7 మిలియన్ల వ్యూస్ వచ్చాయని చిత్రబృందం అధికారికం గా ప్రకటించింది. గణాంకాల నేపథ్యంలో చిత్ర బృందం ఒక ఆసక్తికర కామెంట్ చేసింది. 'ఇది సాధారణ రికార్డ్ కాదు, భవిష్యత్తులో వచ్చే సినిమాలన్నింటికీ ఇది ఒక హెచ్చరిక. అంటూ రాసుకొచ్చారు. మరోవైపు ఇది పుష్ప2 రికార్డ్ కూడా బ్రేక్ చేసిందని అంటున్నారు. ఇప్పటి వరకు సౌత్ ఇండియాలో విడుదలైన 24 గంటలలో 44.67 మిలియన్ వ్యూస్ సాధించిన పుష్ప 2 సాధించింది.



'కుమారి 21 ఎఫ్' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన బోల్డ్ బ్యూటీ హెబ్బా పటేల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తన ఫస్ట్ మూవీతోనే ఈ భామకు ఫుల్ పాపులారిటీ వచ్చేసింది. అలాగే తన అందం, అభినయంతో కుర్రాళ్ల క్రష్ అయిపోయింది. దీంతో ఈ భామ గ్రాఫ్ ఒక్కసారిగా చేంజ్ అయి అమాంతం స్టార్ హీరోయిన్ రేంజ్‌లోకి వెళ్లిపోతుంది అని అందరూ అనుకున్నారు. కానీ అనుకున్నంత స్టార్ డమ్ అయితే రాలేదు. ఆఫర్లు వచ్చినా స్టార్ హీరోయిన్‌గా మాత్రం రాణించలేకపోయింది. ఇక రీసెంట్‌గా ఓదెల-2 మూవీతో మనముందుకు వచ్చిన ఈ అమ్మడు..

## హ్యాపీ బర్త్‌డే విష్ చేసిన హెబ్బా పటేల్..

ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా అడపాదడపా సినిమాల్లో నటిస్తూ హీరోయిన్‌గా రాణిస్తోంది. కానీ నిత్యం సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్‌గా ఉంటూ తన హాట్ హాట్ ఫొటోలతో పాటు వ్యక్తిగత విషయాలు, సినిమా విశేషాలను పంచుకుంటూ ఫ్యాన్స్‌కు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ ముద్దుగుమ్మ పోస్ట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. తాజాగా హెబ్బా తన ఇన్‌స్టాలో ఓ స్టోరీ పెట్టింది. అందులో యాక్టర్ నవీన్ నేని ఫొటో షేర్ చేస్తూ బిలేటెడ్ హ్యాపీ బర్త్‌డే హీరో అని రాసుకొచ్చింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు ఫస్ట్ సినిమాలో నటించిన అతన్ని గుర్తు పెట్టుకుని విష్ చేసిందా అని షాక్ అవుతున్నారు. ఇంకొంత మంది మాత్రం అతనికి విష్ చేస్తున్నారు.

## తొలి భారతీయ నటిగా దీపికకు అరుదైన గౌరవం



తెరపై హీరోలకు దీటుగా యాక్షన్ సన్నివేశాలు చేస్తూ ప్రేక్షకుల్ని ఆశ్చర్య పరుస్తుంటుంది బాలీవుడ్ అందాల తార దీపికా పదుకొణె. ప్రస్తుతం వరుస అవకాశాలతో జోరు చూపిస్తున్న ఈమె.. అంతర్జాతీయ స్థాయిలో ఓ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కు ఎంపికయ్యింది దీపిక. తాజాగా హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను విడుదల చేసింది. మోషన్ పిక్చర్స్ విభాగంలో ఆమె ఈ ఘనతను సొంతం చేసుకుంది. అంతే కాదు.. ఈ గౌరవాన్ని దక్కించుకున్న తొలి భారతీయ నటి కూడా దీపికనే కావడం విశేషం. 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కు ఆమెతోపాటు.. హాలీవుడ్ తారలు డెమి మూర్, రాచెల్ మెక్‌ఆడమ్స్, ఎమిలీ బ్లంట్ లాంటి 35 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసినట్లు ఛాంబర్ తెలిపింది. వినోదరంగంలో గణనీయమైన కృషి చేసినందుకు గాను వీరిని ఎంపిక చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుతం తెలుగులో అట్లీ-అల్లు అర్జున్ కలయికలో రాబోతున్న చిత్రంలో నటిస్తుంది దీపిక.

## భారీ స్థాయిలో విడుదలకు వార్-2 సిద్ధం

యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ మల్టీస్టారర్ వార్ 2. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తున్నాడుర్. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లిమ్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తోంది. బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ భారీ బ్జడెట్ చిత్రం ఏడాది ఆగస్టు 14 న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. అయితే ఈ సినిమా రిలీజ్ కు భారీ ఏర్పాట్లు చేస్తుంది యష్ రాజ్ ఫిల్మ్స్. ఇండియన్ సినిమా హిస్టరీలోనే జరగనటు వంటి రీతిలో రిలీజ్ చేస్తున్నారట. వినిపిస్తున్న సమాచారం ప్రకారం వార్2 ను ఇండియా వైడ్ గా సుమారు 9,000 స్క్రీన్స్ లో రిలీజ్ చేసేలా చేస్తున్నారట. అదే జరిగితే ఇది ఓ హిస్టరీ అనే చెప్పాలి. ఇప్పటి వరకు అత్యధిక స్క్రీన్స్ లో రిలీజ్ అయిన ఇండియాన్ సినిమాల లిస్ట్ లో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన రోబో 2.క్ష మొత్తం 7,500 స్క్రీన్స్ పేరిట ఉంది. ఇప్పుడు దాన్ని బీట్ చేయబోతుంది వార్ 2. ఇటు తెలుగు స్టేట్స్ లోను వార్ 2 రిలీజ్ కు భారీ ఏర్పాట్లు జారుతున్నాయి. ఈ సినిమా రైట్స్ ను సితార నాగవంశీ రూ. 90 కోట్లకు కొనుగోలు చేసారు. ఇంతటి భారీ అంచనాల మధ్య విడుదలవుతున్న వార్ 2 ఎంతటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.




Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com